www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 212 | శుక్రవారం 02.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




## పేదల ఆవేదన అర్థం చేసుకునే మనసు ఉండాలి..

**యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోడీ**

### పాలనలో ఏఐ వినియోగం పెంచాలి



- సివిల్ సర్వీసుల్లో సమూల మార్పులకు పిలుపు
- ప్రజలే కేంద్రంగా అధికారుల సేవలు
- పేదల సమస్యలపై సత్వర స్పందన అవసరం
- సెల్ఫ్ అప్రైజల్‌తో ఉద్యోగుల పనితీరు
- ఏఐతో పాలన మరింత వేగవంతం
- సివిల్ సర్వీసుల్లో టెక్నాలజీకి పెద్దపీట
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఎంపిక ప్రక్రియ 02

**ప్రజా విశ్వాసమే యూపీఎస్సీకి బలం**

# తెలంగాణలో కరువు టెన్షన్..

## 235 మండలాల్లో వర్షాభావం..

**వర్షాభావంపై సర్కార్ అలర్ట్.. రైతులకు భరోసా**

**కరువు ప్రాంతాలకు కేంద్ర సాయం కోసం కసరత్తు**

- వర్షాభావంపై సర్కార్ అలర్ట్.. రైతులకు భరోసా
- ఎల్‌నినో ఎఫెక్ట్‌పై ప్రభుత్వంలో కదలిక
- కరువు నివారణకు కార్యాచరణకు సిద్ధం
- రైతాంగ సమస్యలపై కేబినెట్ ప్రత్యేక దృష్టి
- 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితుల గుర్తింపు
- కరువు ప్రాంతాలకు కేంద్ర సాయం కోసం కసరత్తు
- వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్షంతో చర్చ
- పంట నష్టంపై సమగ్ర నివేదికకు ప్రభుత్వం సిద్ధం
- తాగు, సాగునీటి సమస్యలపై కేబినెట్ సమీక్ష 03
- కరువు ప్రభావిత ప్రాంతాలకు తక్షణ సాయం
- కరువు నివారణకు పార్టీలతో సర్కార్ సంప్రదింపులు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**
తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం, దానివల్ల తలెత్తిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షభావం కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తాగునీరు, సాగునీటి ఎద్దడిపై మంత్రులు లోతుగా సమీక్షించారు. బాధితులను ఆదుకునేందుకు తక్షణమే చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై ప్రత్యేకంగా చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీని రంగంలోకి దించాలని నిశ్చయించారు.



## దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు

**ఓటు హక్కుపై రాజకీయ రగడ**

- ఓట్ల తొలగింపుపై దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం
- ఓట్ల పునరుద్ధరణకు దానం డిమాండ్
- ఈసీపై దానం ఘాటు వ్యాఖ్యలు
- హిమాయత్‌నగర్‌లో ఓట్ల తొలగింపుపై దుమారం 05

## ఖైరతాబాద్ ఉపఎన్నికకు బ్రేక్?

- ఖైరతాబాద్ ఉపఎన్నికపై హైకోర్టులో కీలక పిటిషన్
- ఉపఎన్నిక నోటిఫికేషన్ నిలిపివేయాలని విజయారెడ్డి పిటిషన్
- పాత ఎన్నికల పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఆపాలని విజ్ఞప్తి 03



## కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యంపై ఆందోళన

**కాక్‌పిట్‌లోని క్రాష్ యాక్స్‌తో దాడి**

- తోటి పైలట్ దాడిలో గాయపడిన కెప్టెన్‌కు చికిత్స
- ప్రయాణికులను కాపాడిన పైలట్‌కు మెరుగైన వైద్యం
- మచ్చర్ ఆరోగ్యం నిలకడగా.. దుబాయ్‌కు తరలింపు 02
- పైలట్ ఆరోగ్యంపై కొనసాగుతున్న ఆందోళన



## మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ



- రూ.804 కోట్ల ఖాతాలపై సుప్రీం కీలక నిర్ణయం
- బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై ఊరట కరువు
- ఖాతాల నిర్వహణపై ఈసీ నిర్ణయమే కీలకం 02
- పార్టీ నిధులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

## ప్రశ్నిస్తున్నామని ఆయనకు కోపం

**సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?**

- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్న కేటీఆర్
- సిరిసిల్లలో కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ నిప్పులు
- నేతన్నల ఆత్మహత్యలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- యూరియా కొరతపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన కేటీఆర్ 03




'మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం' అని స్పష్టం చేశారు. రేవంత్ సోదరులకు రూ.1,000 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ.. దీనిపై సిట్టింగ్ జడ్జికి లేఖ రాసేందుకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'మిమ్మల్ని వదలం.. హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం.



## ఎల్‌నినోపై ఐఎండీ అంచనా

**ఈ శీతాకాలం చాలా హాట్ గురు..**

- నైరుతి రుతుపవనాలకు వీడ్కోలు.. వేడెక్కనున్న శీతాకాలం 05
- ఎల్‌నినో ప్రభావంతో పెరగనున్న ఉష్ణోగ్రతలు
- 13 శాతం వర్షపాత లోటుతో ముగిసిన వర్షాకాలం
- అక్టోబర్‌లోనూ ఎండల తీవ్రతకు అవకాశం
- దక్షిణాదికి ఊరట.. సాధారణ వర్షాలకు అవకాశం

## చారిత్రక బావికి ప్రాణం పోస్తున్న హైడ్రా

**చారిత్రక బౌలికి మళ్లీ జలసిరి**

- శివరాంపల్లిలో చారిత్రక బావికి కొత్త జీవం
- ఖుమ్-రుక్న-ఉద్-దౌలా చెరువు కింద బావి పునరుద్ధరణ
- 356 ఏళ్ల చారిత్రక బావికి హైడ్రా పునర్జీవం
- నీటితో చరిత్రను ముడిపెడుతున్న హైడ్రా
- పాతబస్తీలో పూర్వ వైభవం సంతరించుకుంటున్న బావి
- చెత్త కుప్ప నుంచి చారిత్రక బౌలికి కొత్త రూపు 02
- జల సంరక్షణతో వారసత్వ పరిరక్షణకు బాట





# పేదల ఆవేదన అర్థం చేసుకునే మనసు ఉండాలి..

**ఢిల్లీ :** సివిల్ సర్వీస్ ఎంపిక ప్రక్రియను ఆధునీకరించాలని, ఉద్యోగుల సెల్ఫ్ అప్రైజల్ పద్ధతిని ప్రోత్సహించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. గురువారం ఢిల్లీలో యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడిన ఆయన.. సిటిజన్ ఫస్ట్ అనేది సివిల్ సర్వీస్ ఉద్యోగుల ప్రథమ లక్ష్యం కావాలన్నారు. పేదల ఆవేదన అర్థం చేసుకునే మనసు ఉద్యోగులకు ఉండాలని పేదల సమస్యల సత్వర పరిష్కారానికి సాంకేతికతను వాడాలన్నారు. దేశం సంస్కరణ రథంపై పరుగు పెడుతోందన్నారు. దేశం క్రమంగా పట్టణీకరణ వైపు ప్రయాణిస్తోందని ఈ విషయంలో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రభుత్వ సేవల్లో ఏఐని సమర్థంగా వాడుకోవాలని సూచించారు. లక్షల కొద్ది పేజీల డేటాను ఏఐ కొద్ది సేపట్లోనే ప్రాసెస్ చేస్తోందన్నారు.

**ప్రతి భారతీయుడి నమ్మకం:**

ఈ రోజు యూపీఎస్సీ 100 సంవత్సరాల ప్రయాణాన్ని జరుపుకోవడమే కాకుండా, ఒక గొప్ప వారసత్వాన్ని కూడా జరుపుకుంటున్నామన్నారు. ఇది ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత కలలు కనే ఆకాంక్షల ఉత్సవం. ఈ సంస్థపై ప్రతి భారతీయుడు ఉంచిన నమ్మకానికి ఇది ప్రతీక. ఈ 100 ఏళ్ల ప్రయాణంలో తరాలు మారాయి, ప్రభుత్వాలు మారాయి, సాంకేతికత రూపాంతరం చెందింది మరియు సిలబస్ కూడా మారింది... అయినప్పటికీ, యూపీఎస్సీపై ఉన్న నమ్మకం మాత్రం ఎప్పటిలాగే ఏమాత్రం చెక్కుచెదరకుండా నిలిచిందన్నారు.

యూపీఎస్సీ చరిత్రలో ఇప్పటి వరకు నలుగురు మహిళా చైర్ పర్సన్స్ పని చేశారని ఇందులో ముగ్గురు 2014 తర్వాత నియమించిన వారేనన్నారు. యూపీఎస్సీ 100 సంవత్సరాల మైలురాయిని పురస్కరించుకుని ఒక ప్రత్యేక పోస్టల్ స్టాంప్ ను ప్రధాని విడుదల చేశారు.

# నేటి పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలి..




**నల్గొండ జిల్లా/ తిప్పర్తి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే క్యాష్ లెస్ చికిత్స అందించేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారం రోజులపాటు టీయూడబ్ల్యూజే(143) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి పోస్టు కార్డుల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన టీయూడబ్ల్యూజే(143) తిప్పర్తి మండల కమిటీని అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. టీయూడబ్ల్యూజే 143 అనే సంఘం జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు . జర్నలిస్టుల సంక్షేమం కోసం గతంలో హెల్త్ కార్డుల సాధనతో పాటు మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం, వారి పిల్లల విద్యకు చేయూత అందించినట్లు తెలిపారు. కరోనా సమయంలోనూ అల్లం నారాయణ ఆధ్వర్యంలో కరోనా బారిన పడిన జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం జర్నలిస్టుల హెల్త్ కార్డులు కొన్ని ఆసుపత్రుల్లోనే పరిమితంగా అమలవుతున్నాయని, రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో కార్డులు చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీకి అభినందనలు..**

**టీయూడబ్ల్యూజే(143) తిప్పర్తి మండల నూతన అధ్యక్షుడిగా జేరుపోతుల సైదులు గౌడ్ (సీనియర్ జర్నలిస్టు),** ప్రధాన కార్యదర్శిగా జంజరాల రవికుమార్ (నమస్తే తెలంగాణ) ఎన్నికైన సందర్భంగా వారిని భినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఫహీమ్, నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, దండంపల్లి రవికుమార్, గంట సైదులు, మామిడి వెంకటేశ్వర్లు, కారింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫారమ్-6 కు డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 92 లక్షల మందికి నోటీసులు ఇస్తే ఇప్పటి వరకు 65 లక్షల మంది ఓటర్లు నోటీసులకు సమాధానం ఇచ్చినట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. 54 లక్షల మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు. నవబంర్ 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ ఉంటుందని ఆలోపు మిగతా ఓటర్లను కూడా తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు హియరింగ్ అనే ప్రక్రియ ఉండేదని ఇకపై దాని స్థానంలో డాక్యుమెంట్ కలెక్ట్ చేసుకోవడమే ఉంటుందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80 వేల మందికి నోటీసులు ఇచ్చామని, నోటీసులు అందుకున్న వారిలో 40 శాతం మందిని తుది ఓటరు జాబితాలోకి తీసుకువచ్చామన్నారు.

**ఇంటివద్దకే బీఎల్వోలు:**

నోటీసులు అందినవారి ఇళ్ల దగ్గరకే బీఎల్వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారన్నారు. ఒక చోట కూర్చుని ఓటర్లను పిలిపించుకోవడం కుదరదని ఓటర్ల ఇళ్ల వద్దకే వెళ్లి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు బీఎల్వోలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పని లేదని ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుందన్నారు. ఫారమ్-6 కు డిక్లరేషన్ అనేది ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని, తెలంగాణలో ఎస్ఐఆర్ ఇంకా కొనసాగుతున్నందునా ఫారమ్-6 కు డిక్లరేషన్ తప్పనిసరి అని స్పష్టం చేశారు. నోటీసులు అందిన వారిలో ఎవరైనా వలస వెళ్లి ఉంటే అలాంటి వారిని పిలవాల్సిన అవసరం లేదని ఈఆర్వో ఆన్‌లైన్‌లోనే వారిని సంప్రదించి ప్రక్రియను పూర్తి చేస్తారన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలనేది ఈసీ ఉద్దేశం అన్నారు.

**మరోసారి గడువు పెంపు లేదు:**

సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదన్నారు. ఇప్పటికే ఓసారి గడువు పెంపుకోరామని అందువల్ల ఇది కుదరదన్నారు. ప్రస్తుతం ఉన్న గడువు ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలుకు గడువు అక్టోబర్ 7 వరకు ఉండగా నోటీసులు జారీ/అభ్యంతరాల పరిష్కారానికి నవంబర్ 5 వరకు, తుది ఓటరు జాబితా 9 నవంబర్న ప్రచురించనున్నారు.

# భర్త ఫోన్ లొకేషన్ ట్రాక్ చేసి సుపారీ!

**తమిళనాడు :** పోలీసులమని చెప్పి లాడ్జీలో ఉన్న జంటను బెదిరించి మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ఊహించని ట్విస్ట్ నమోదైంది. తన భర్తతో సన్నిహితంగా ఉంటోందని ఆమె ప్రియుడి భార్యే సుఫారీ ఇచ్చి ఈ పని చేయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గత నెలలో కేరళలో జరిగిన ఈదారుణ ఘటనలో తమిళనాడు పోలీసులు జరిపిన విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అసలేం జరిగిందంటే..

**కారులో తీసుకెళ్లి అత్యాచారం:**

తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన ఓ మహిళ తన ప్రియుడితో కలిసి గత నెలలో కేరళకు వెళ్లారు. అక్కడా ఓ కేఎస్ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ లాడ్జిలో ఇద్దరూ బస చేశారు. అయితే లాడ్జిలో ఉండగా తాము పోలీసులమని చెప్పి గదిలోకి బలవంతంగా ప్రవేశించిన ఐదుగురు వ్యక్తులు సదరు మహిళను, ఆమె ప్రియుడిని కాళ్లు, చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి కారులో తమిళనాడుకు తీసుకెళ్లారు. ప్రయాణ సమయంలో ప్రియుడిపై తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనలో అతడి చేతులు, కాళ్లకు ఫ్రాక్చర్లు అయ్యాయి. అనంతరం అతడిని తిరుప్పూర్‌లోని ఓ ఆసుపత్రి సమీపంలో వదిలేశారు. అనంతరం ఆ ముఠాలోని ఇద్దరు వ్యక్తులు ఆ మహిళను మరో కారులోకి మార్చి ఆమెపై దారుణంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**లోకేషన్ ట్రాక్ చేసి సుఫారి ఇచ్చిన భార్య:**

బాధితురాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును త్రిశూర్ సిటీ పోలీసులకు అప్పగించారు. దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధిత మహిళతో తన భర్తకు ఉన్న సంబంధంపై ఆగ్రహంతో రగిలిపోతున్న భార్య తన భర్త మొబైల్ ఫోన్ లొకేషన్‌ను నిరంతరం ట్రాక్ చేస్తూ వస్తోంది. ఈ క్రమంలోవారు త్రిస్సూర్ లాడ్జ్‌లో ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న భార్య వెంటనే ఓ గ్యాంగ్ కు సుపారి ఇచ్చి దాడి చేయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో సదరు భార్యతో సహా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# నాదర్ గుల్ డివిజన్ సమస్యల పై రాజ్యసభ సభ్యుడికి వినతి పత్రం



**బడంగ్‌పేట్,ఫ్లాష్ ఇండియా :** నాదర్ గుల్ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా సహకరించాలని కోరుతూ ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గురువారం రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాదర్‌గుల్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పన, ప్రధాన రహదారుల అభివృద్ధి సహా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాజ్యసభ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని రాఘవేందర్ రెడ్డి వెల్లడించారు.

# చారిత్రక బావికి ప్రాణం పోస్తున్న హైడ్రా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన హైదరాబాద్‌లో ఏ ప్రాంతానికి వెళ్లినా చారిత్రక నేపథ్యం ఉంటుంది. ఇక పాత బస్తీ గురించి ప్రత్యేకంగా చెప్పాలా.. అడుగడుగునా చారిత్రక సాక్ష్యాలు ఎన్నో.. అదే కోవకు వస్తుంది శివరాంపల్లిలోని బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు. ఈ చెరువుకు 356 ఏళ్ల చరిత్ర ఉంటే.. ఆ చెరువు కింది భాగంలో 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊట బావికి కూడా అంతే ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉంది. ఇప్పటికే చెరువును పునరుద్ధరించి పాతబస్తీకి మణిహారంగా అందించిన హైడ్రా ఇప్పుడు ఆ చెరువు కింద ఉన్న ఊట బావికి కూడా జీవం పోయాలని నిర్ణయించింది. 1.50 ఎకరాల విస్తీర్ణంలోని ఈ చారిత్రక బౌలి పునరుద్ధరణను వారసత్వ పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి, ప్రజా ప్రయోజనం అనే మూడు అంశాలను సమన్వయం చేసే కార్యక్రమంగా హైడ్రా భావించింది. నిర్లక్ష్యానికి గురైన చారిత్రక ఆస్తిని తిరిగి ప్రజలకు అందివ్వడం.. పర్యావరణానికి ఉపయోగపడేలా చూడడమే ఈ బావి పునరుద్ధరణ ముఖ్య ఉద్దేశం. నగర చారిత్రక జల నిర్వహణ పద్ధతులను పౌరులు, విద్యార్థులు, భవిష్యత్ తరాలు తెలుసుకుని, అర్థం చేసుకునే అవకాశాన్ని హైడ్రా కల్పిస్తోంది. ఇటీవలే పనులు మొదలయ్యాయి. రెండు మూడు నెలల్లో ఈ పనులు పూర్తయి.. ఊటబావిలోకి పుష్కలంగా నీరు రానుంది.

**ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారి ఆదేశాల మేరకు..**

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును మార్చి నెల 8వ తేదీన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అప్పుడే ఈ చెరువుకు ఆనుకుని ఉన్న చారిత్రక బావి విషయాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డిగారి దృష్టికి తీసుకెళ్లారు. వెనువెంటనే అభివృద్ధికి అడుగులు పడ్డాయి. చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థనే ఇప్పుడు చెరువు కింద ఉన్న చారిత్రక బావి పునర్నిర్మాణాన్ని కూడా చేపట్టింది. నిజాంల కాలంలో పాలకులకు ఔషధ గుణాలున్న తాగునీరందించిన చెరువుతో పాటు కిందన ఉన్న ఊట బావి కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో హైడ్రా చరిత్రను తవ్వితీసిన విషయం అందరికీ విధితమే. 100 ఎకరాల మేర విస్తరించి ఉన్న ఈ చెరువు కబ్జాలకు గురైంది. చివరకు 4 ఎకరాలకు పరిమితమైంది. హెచ్ ఎం డీ ఏ లెక్కల ప్రకారం 17 ఎకరాలు కగా ఆ మేరకు ఆక్రమణలను తొలగించి చెరువుకు హైడ్రా జీవం పోసింది. మట్టితో నింపేసి లే ఔట్‌గా మార్చిన తరుణంలో.. కబ్జాలను తొలగించి చెరువును తవ్వి తీసింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు ఊట బావిని కూడా పునరుద్ధరిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, మట్టి, ఒండ్రుమట్టి (స్లష్), దట్టమైన పిచ్చి మొక్కలతో నీటిని నిల్వ చేసే సామర్థ్యం కోల్పోయిన ఊట బావిని తవ్వి చరిత్రకు జీవం పోస్తోంది హైడ్రా.

**చరిత్రం ఎంతో ఘనం.. హైడ్రాతో భావి తరాలకది సజీవం**

చారిత్రక నగరంలో ఎన్నో పురాతన బావిలున్నాయి. ఒక్కో బావిది ఒక్కో చరిత్ర అయితే బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు కింద ఉన్న బావికి కూడా చాలా పేరుంది. ఈ ఊట బావిలో నీరు ఔషధ గుణాలుండేవని.. నిజాం పాలకులు ఆ నీటినే తాగేవారని చెబుతుంటారు. బుమ్-రుక్న్-ఉద్-దౌలా సంస్సు కేవలం ఒక జలవనరు మాత్రమే కాదు.. నగర ప్రజల వారసత్వ సంపద. మూడవ నిజాం సికందర్ జా పాలనా కాలంలో.. సుమారు 1770 ప్రాంతంలో ఈ సరస్సును నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్-ఉద్-దౌలా పేరుమీదుగా ఈ సరస్సుకు పేరు వచ్చినట్లు చారిత్రక సమాచారం. దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సరస్సు కట్ట, పరిసరాల్లోని ఔషధ మొక్కల ద్వారా నీరు సహజంగా వడపోతకు గురై బౌలిలోకి చేరేదని, అక్కడి నీరు స్వచ్ఛతతో పాటు ఔషధ గుణాలకు కూడా విలువైనదిగా భావించేవారని చెబుతారు. ఔషధ గుణాలున్న ఈ నీటిని ఎడ్ల బండ్ల ద్వారా సుదూర ప్రాంతాలకు తరలించేవారని, చివరకు లండన్ వరకు కూడా ఈ నీటికి సంబంధించిన ప్రయాణం జరిగినట్లు కథనాలు ఉన్నాయి. చెరువులో ఔషధ గుణాలున్న చెట్ల కొమ్మలు, బెరడలు, పూలు వేసి.. ఉంచడం. చెరువు కింద ఉన్న ఊట బావిలోకి వచ్చిన ఆ నీటిలో ఔషధ గుణాలుండేవని చరిత్ర చెబుతోంది. బుమ్ - రుక్న్-ఉద్-దౌలా చెరువు, ఔషధ మొక్కలు, పురాతన బౌలి.. ఇవన్నీ కలిసి హైదరాబాద్‌లో నీటి సంరక్షణ, సహజ వడపోత, ప్రకృతి ఆధారిత వైద్య విధానాలపై ఉన్న సంప్రదాయ జ్ఞానానికి ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తాయి. బుమ్-రుక్న్-ఉద్-దౌలా వారసత్వాన్ని పరిరక్షించడం అంటే కేవలం ఒక సరస్సును కాపాడటమే కాదు.. నీరు, ప్రకృతి, వైద్యం, నిజాం రాజవంశ చరిత్రతో ముడిపడిన శతాబ్దాల నాటి వారసత్వాన్ని పరిరక్షించడంగా హైడ్రా బావిస్తోంది.

# కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యంపై ఆందోళన

**రియాద్ :** దుబాయ్ ఘటలో తనపై తోటి పైలట్ దాడి చేసిన ఘటనలో ప్రాణాలకు తెగించి ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ గురువారం ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం ఎయిర్ లిఫ్ట్ చేశారు. సౌది నుంచి దుబాయ్ కి విమానంలో తరలిస్తున్నారు. ఇప్పటి వరకు అతడికి వాయువ్య సౌదీ అరేబియాలోని తబుక్ నగరంలో ఉన్న ఒక ఆసుపత్రిలో అవసరమైన వైద్య సహాయం అందుతోందని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా పోస్ట్‌లో ఇవాళ పేర్కొంది. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి అప్‌డేట్ రావాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆయన "నిలకడగా ఉన్నట్లు సమాచారం" అని తెలిపింది. జిద్దాలోని భారత కాన్సులేట్ జనరల్, ఎంబసీ అధికారులు మచ్చార్ ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నారని స్పష్టం చేసింది. ఆయన త్వరలోనే గాయాల నుండి కోలుకోవాలని ఆశిస్తున్నాం. మేము ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉన్నాం. సౌదీ అధికారులతో మాట్లాడుతూ ఆయన ఆరోగ్యానికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకుంటామని, ఆయన సంక్షేమం కోసం సాధ్యమైనంత అన్ని విధాలా సహాయం అందిస్తామని వారికి అభయం ఇచ్చామని ఎంబసీ పేర్కొంది.

**కత్తితో కాదు గొడ్డలితో దాడి?:**

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ కు 174 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానాన్ని కూల్చివేయాలని కోపైలట్ ప్రయత్నించగా పైలట్ మచ్చర్ దాన్ని అడ్డుకున్నారు. మొదట కోపైలట్ కత్తితో దాడి చేశాడని భావించినప్పటికీ కత్తికి బదులు గొడ్డలితో దాడికి పాల్పడినట్లు పలు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. విమానంలో అత్యవసర సమయాల్లో వాడే 'క్రాష్ యాక్స్' (గొడ్డలి)తోనే ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాడి జరిగిన తీరుపై కథనాలు, మరో వైపు మచ్చర్ ను సౌదీ నుంచి ఎయిర్ లిఫ్ట్ చేయడంతో మచ్చర్ ఆరోగ్య పరిస్థితిపై భారతీయుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

**కాక్‌పిట్‌లో గొడ్డలి ఎందుకు ఉంటుంది?**

విమానం గాల్లో ఉండగా ఆయుధం కాక్‌పిట్‌లోకి ఎలా వచ్చిందనే సందేహం అందరిలోనూ నెలకొంది. అయితే నిందితుడు బయటి నుండి ఎలాంటి ఆయుధాన్ని స్మగ్లింగ్ చేయలేదని విచారణలో తేలింది. అంతర్జాతీయ ఏవియేషన్ రూల్స్ ప్రకారం ప్రతి కమర్షియల్ విమాన కాక్‌పిట్‌లో తప్పనిసరిగా అత్యవసర పరిస్థితుల్లో (ఎమర్జెన్సీ క్రాష్/అగ్నిప్రమాదాలు) వాడేందుకు 'క్రాష్ యాక్స్' (ఫైర్ గొడ్డలి)ను ఏర్పాటు చేస్తారు. 25 ఏళ్ల క్రితం వరకు ఇవి ప్రధాన క్యాబిన్‌లో ఉండేవి. అయితే సెప్టెంబర్ 11 (9/11) ఉగ్రదాడి ఘటన తర్వాత భద్రతా కారణాల దృష్ట్యా ఈ అత్యవసర గొడ్డలిని నేరుగా కాక్‌పిట్‌లో, పైలట్లకు అందుబాటులో ఉండేలా అమర్చడం ప్రారంభించారు. నిందితుడు ఈ అత్యవసర సాధనాన్నే ఆయుధంగా మార్చుకుని దాడికి తెగబడినట్లు తెలుస్తోంది.

# మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ



**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ పోలీసులు తమ పార్టీకి చెందిన నాలుగు బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయడాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ విభాగం దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇండియన్ బ్యాంక్ ఖాతాల సీజ్‌పై మధ్యంతర ఉపశమనం అందించడానికి నిరాకరిస్తూ కలకత్తా హైకోర్టు ఆగస్టు 27న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మమతా వర్గం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. రూ. 804 కోట్లు ఉన్న బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ నుంచి విముక్తి చేయాలన్న పిటిషన్ ను కొట్టివేసింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. టీఎంసీ పార్టీ గుర్తు వివాదం ఈసీ వద్ద ఇంకా పెండింగ్ లోనే ఉండటంతో.. కలకత్తా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో మెరిట్స్ జోలికి తాము వెళ్లడంలేదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

**రాష్ట్ర పోలీసుల చర్యతో పార్టీ కార్యకలాపాలు స్తంభించాయి: టీఎంసీ వర్గం**

హైకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ తరుఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఏ.ఎం. సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయడం ద్వారా పార్టీ రాజకీయ కార్యకలాపాలను అడ్డుకునే యత్నం జరుగుతోందని, ఇది తమను తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు. త్వరలో రానున్న ఉపఎన్నికల నేపథ్యంలో పార్టీ నిర్వహణ ఖర్చులకు నెలకు కనీసం రూ. 12.15 కోట్లు అవసరమని తెలిపారు. దేశంలోనే మూడో అతిపెద్ద పార్టీ అయిన ఎఐటిసి (మా×జ)కి ప్రాథమిక రాజకీయ కార్యకలాపాలకే ఈ నిధులు అత్యవసరమని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారిక ప్రతిపక్షం అధికార పార్టీకి మద్దతు ఇస్తోందని, ఎన్నికల్లో ఓడిపోయిన ప్రధాన ప్రతిపక్షమైన తమను రాష్ట్ర పోలీసులు నిశ్చేష్టం చేస్తున్నారని, ఎలాంటి కోర్టు ఉత్తర్వులు లేకుండానే పోలీసులు ఖాతాలను నిలిపివేశారని వాదించారు.

**అసలైన తృణమూల్ ఎవరో తేలేవరకు వేచి చూడాలి: ప్రభుత్వం**

మమతా వర్గం అభ్యర్థనను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరైన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తీవ్రంగా వ్యతిరేకించారు. రెండు వర్గాలు తామే అసలైన తృణమూల్ అని దావా వేస్తున్నాయని, ఈ వివాదాన్ని పరిష్కరించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరిందని గుర్తుచేశారు. ఎన్నికల గుర్తును ఈసీఐ ఫ్రీజ్ చేసినందున, అసలైన పార్టీ ఏదో తేలేవరకు బ్యాంక్ ఖాతాలను ఎవరు నిర్వహించాలనేది నిర్ణయించలేమని తెలిపారు. ఇదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పర్సనల్ సెక్రటరీ సుమిత్ రాయ్ రోడ్లపై సేకరించిన రూ. 35 కోట్ల నగదును ఈ ఖాతాల్లో జమ చేసినట్లు దర్యాప్తులో తేలిందని మెహతా కోర్టుకు వివరించారు. మునుపటి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి సంపాదించిన అక్రమ సొమ్మునే ఇందులో జమ చేశారని, దీనిపై ముమ్మర విచారణ జరుగుతోందని, దీనిపై దసరా సెలవుల తర్వాత కలకత్తా హైకోర్టు విచారణ జరపనుందని స్పష్టం చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ప్రజలను విభజించే అలవాటు కాంగ్రెస్ పార్టీది..



**ఢిల్లీ :** పరమశివుడు పేదోళ్లకు.. శ్రీరాముడు ధనికులకు దేవుడని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. ఇవాళ ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మతాల పేరులో ప్రజల మధ్య సీఎం రేవంత్ రెడ్డి లేని వైషమ్యాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. చివరకు దేవుళ్లను కూడా రాజకీయాల్లో లాగుతున్నారని ధ్వజమెత్తారు. మొత్తం హిందూ సమాజాన్నే అవమాన పరిచేలా రాముడు, శివుడు పేరుతో సీఎం వ్యాఖ్యలు హిందువుల మధ్య గొడలు పెట్టేలా ఉన్నాయని కామెంట్ చేశారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కొత్త అంశాలను తెరపైకి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను విభజించే అలవాటు కాంగ్రెస్ ఆనాటి నుంచే ఉందని ఆరోపించారు. హిందు దేవుళ్లపై మాట్లాడుతున్నారు.. ఇతర మతాల దేవుళ్లపై మాట్లాడే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు.

# అన్ని నిర్ణయాలు ఏకగ్రీవమే

**ఢిల్లీ :** ఎన్నికల సంఘంలో విభేదాలు తలెత్తాయని, ముగ్గురు కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నట్లు వార్తలు రావడంతో దేశవ్యాప్తంగా ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది. అయితే, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో , 2025 ఫిబ్రవరి 19 నుంచి ఏ ఎన్నికల కమిషనర్ కూడా ఏ నిర్ణయంపైనా విభేదించలేదని ఎన్నికల సంఘం వర్గాలు గురువారం తెలిపాయి. "ఏకగ్రీవం"గానే ప్రతీ నిర్ణయం తీసుకున్నట్లు కమిషన్ తెలిపింది. మరణించిన, నకిలీ, మోసపూరిత, వేరే చోటికి వెళ్ళిపోయిన ఓటర్లను గుర్తించడం, అలాగే అర్హులైన ఓటర్లందరూ ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని ఈసీ చెబుతోంది.ప్రధాన ఎన్నిక కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలోని ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలను మిగతా ఇద్దరు కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు తమ అంగీకారం తెలిపిన తర్వాతే చేపట్టినట్లు ఈసీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల, జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు 10 నెలల్లో 14 సార్లు అధికారికంగా తమ అభ్యంతరాలు తెలిపినట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించడం సంచలనంగా మారింది. అయితే, ఈ నివేదిక వచ్చిన వారం తర్వాత, ఇప్పుడు అన్ని నిర్ణయాలు కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నట్లు వెల్లడైంది.

**ఆరోపణలపై ఈసీ క్లారిటీ..**

మరోవైపు, ఈసీపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు క్లారిటీ ఇచ్చింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు తుది ఓటర్ల జాబితాలో లేకపోవడానికి సాంకేతిక లోపమే కారణమని ఈసీ తెలిపింది. వీరిలో 88 మంది పేర్లు చేర్చినట్లు వెల్లడించింది. ఢిల్లీలోని బేలా ఎస్టేట్‌లోని 727 మంది ఓటర్ల పేర్లు తొలగించారనిర రాహుల్ గాంధీ ఆరోపణలపై స్పందిస్తూ.. అక్కడకు బీఎల్ఓ వెళ్లిన సమ-యంలో ఎవరూ అందుబాటులో లేరని, దీంతో ధ్రువీకరణపై సంతకాలు తీసుకోవడంలో సమస్య ఏర్పడిందని ఈసీ వర్గాలు వెల్లడించాయి.దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో దాదాపు 25,000 మంది ఈఆర్వో లు, ఏఈఆర్వో లు పాల్గొంటున్నారని, వారిలో ఎవరూ ప్రక్రియపై ఫిర్యాదు చేయలేదని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. ఓటర్ల మార్పులు చేర్పులు, తొలగింపు ప్రక్రియను ఎన్నికల కమిషనర్లు వ్యక్తిగతం నిర్వహించరని, ఇది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్థాయిలో వికేంద్రీకృతం అవుతాయని వివరించింది.

**దేశవ్యాప్తంగా నిరసనలు..**

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహిస్తున్నారని, ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీకి అనుకూలంగా ఓట్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ పార్టీ ఆరోపిస్తోంది. దీనిపై ముంబైలో అక్టోబర్ 02న సీజేపీ, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరికొందరు నిరసనకు దిగుతున్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్ణయ ప్రక్రియలో ప్రతీ కమిషనర్ అభిప్రాయానికి విలువ ఉంటుంది. ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు ఒప్పుకుంటేనే ఏ నిర్ణయమైనా అమలు అవుతుంది. నిజానికి సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకునే అధికారమే లేదని నిపుణులు చెబుతున్నారు.

# ఖైరతాబాద్ ఉపఎన్నికకు బ్రేక్?



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ ఉప ఎన్నిక విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇక్కడ ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా నిలిపివేయాలని కోరుతూ పీజేఆర్ కుమార్తె, కాంగ్రెస్ నేత విజయారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2024లో తాను దాఖలు చేసిన పిటిషన్ పై తుది తీర్పు వచ్చే వరకు ఖైరతాబాద్ ఉప ఎన్నిక నిర్వహించే ప్రక్రియను నిలిపివేయాలని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌లో ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

**అఫిడవిట్ పై కోర్టుకు విజయారెడ్డి:**

2023 శాసనసభా ఎన్నికల్లో ఖైరతాబాద్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేయగా కాంగ్రెస్ అభ్యర్థిగా పీజేఆర్ కూతురు విజయారెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో విజయారెడ్డి దానం నాగేందర్‌పై 22,010 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌లో దానం తన భార్య, ఆధారపడిన వారి ఆస్తులకు సంబంధించిన కీలక సమాచారాన్ని దాచిపెట్టారని ఆరోపిస్తూ విజయారెడ్డి హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని ప్రకటించి, ఆయన ఎన్నికను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ పై విచారణ కోర్టులో పెడింగ్ లో ఉంది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవిపై తెలంగాణ హైకోర్టు వేటు వేసింది. హైకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతయ్య ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ గత శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. త్వరలోనే ఈ స్థానానికి ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. ఈ క్రమంలో విజయారెడ్డి తన పాత పిటిషన్ పై మరోసారి కోర్టును ఆశ్రయించడం.. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణలో ఎలాంటి నిర్ణయం ఉంటుంది అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణలో కరువు టెన్షన్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం, దానివల్ల తలెత్తిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావం కారణంగా కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తాగునీరు, సాగునీటి ఎద్దడిపై మంత్రులు లోతుగా సమీక్షించారు. బాధితులను ఆదుకునేందుకు తక్షణమే చేపట్టాల్సిన ఉపశమన చర్యలపై ప్రత్యేకంగా చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీని రంగంలోకి దించాలని నిశ్చయించారు.

**సలహాలు, సూచనల కోసం త్వరలోనే అఖిలపక్ష సమావేశం**

రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్టమైన ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు, కరువు నివారణ ఉపశమన చర్యలపై అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలను తీసుకోనున్నారు. ఇందులో భాగంగా త్వరలోనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని పార్టీల నాయకులు, నిపుణుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కేంద్రం నుంచి సహాయం కోసం ఢిల్లీకి పయనం**

రాష్ట్రంలోని వర్షాభావ మండలాలను అధికారికంగా కరువు మండలాలుగా ప్రకటించడంతో పాటు, బాధిత ప్రాంతాలకు తగినంత ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేయాలని కేబినెట్ తీర్మానించింది. రాష్ట్రంలో ఉన్న వాస్తవ పరిస్థితులు, పంట నష్టం, కరువు తీవ్రతపై త్వరలోనే రాష్ట్ర మంత్రులు, అధికారుల బృందం ఢిల్లీకి వెళ్లనుంది. అక్కడ సంబంధిత కేంద్ర మంత్రులను కలసి రాష్ట్ర పరిస్థితిని సమగ్ర నివేదిక రూపంలో అందించి, కేంద్రం నుంచి తక్షణ ఉపశమన నిధులు రాబట్టేందుకు విన్నవించాలని కేబినెట్ నిర్ణయించింది.

# ప్రశ్నిస్తున్నామని ఆయనకు కోపం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా రైతుల కన్నీళ్లు, గోస మా-త్రమే కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ-్వజమెత్తారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాలు, కక్షసాధింపు చర్యలపై నిప్పులు చెరిగారు. "మోసపోకండి.. మోసపోతే గోస పడతాం" అని కేసీఆర్ ఆనాడే చెప్పిన మాటలు ఈరోజు అక్షరసత్యాలవుతున్నాయని, పాత రాజ్యాన్ని తిరిగితెస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి అదే రకంగా రాష్ట్రాన్ని మళ్లీ కష్టాల్లోకి నెట్టేశారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఒక నిజాయితీ గల మోసగాడని, ఆయన మాట్లాడే దివానా మాటలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 'మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం' అని స్పష్టం చేశారు. రేవంత్ సోదరులకు రూ.1,000 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ.. దీనిపై సిట్టింగ్ జడ్జికి లేఖ రాసేందుకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'మిమ్మల్ని వదలం.. హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. మా తాతకు చింతమడకలో వందల ఎకరాలు ఉండేవి. ఇందుకు సంబంధించిన వివరాలు కూడా సీఎంకు పంపిస్తా' అని కేటీఆర్ పేర్కొన్నారు.

**సిరిసిల్ల పర్యటనపై ధ్వజం.. చేనేత కార్మికులకు దక్కని న్యాయం**

సిరిసిల్లలో ముఖ్యమంత్రి పర్యటించిన తీరుపై కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 35 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తే, సీఎం వారి కుటుంబాలను పరామర్శిస్తారని, ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటిస్తారని ఆశించామని అన్నారు. కానీ, శ-త్రు దేశంపై దండయాత్రకు వెళ్లినట్లు 4,000 మంది పోలీసులను వెంటబెట్టుకుని వెళ్లారని ఎద్దేవా చేశారు. దారిలో జనాలు ఎవరూ లేకపోయినా ఖాళీ రోడ్లకు చేతులు ఊపుకుంటూ వెళ్లడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. నేడు రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా యూరియా దొరకక రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నా బిల్డింగులు, ఫోన్ టాపింగ్ ఆరోపణలు ఏమయ్యాయి?**

గతంలో రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను కేటీఆర్ ఈ సందర్భంగా లేవనెత్తారు. హైదరాబాద్‌లోని భవనాలన్నీ కేటీఆర్‌వేనని, ఫార్ములా-ఈ రేసింగ్‌లో అక్రమాలు జరిగాయని, సినీ నటుల ఫోన్లు టాప్ చేశామని గతంలో నోటికొచ్చినట్లు మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా ఆ ఆరోపణలపై ఏమైనా తేల్చారా అని నిలదీశా-రు. ప్రభుత్వం వద్ద అన్ని అధికారాలు ఉండి కూడా ఏ ఒక్క ఆరోపణను నిరూపించలేకపోయారని, ప్రభుత్వం బ్రహ్మాండంగా దోచుకోవడంలో మునిగిపోయిందని, తాము ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తున్నందుకే సీఎంకు తమపై కోపం వస్తోందని అన్నారు.

**నేను ఆల్తూఫాల్తూగాన్ని కాదు.. కేసీఆర్ వార-సత్వంపై స్పష్టత**

ముఖ్యమంత్రి చేస్తున్న వ్యక్తిగత విమర్శలకు కేటీఆర్ గట్టిగా సమాధానమిచ్చారు. 9వ తరగతి ఫెయిల్ అయిన రేవంత్ రెడ్డి తమ్ముడు ఏరోస్పేస్ కంపెనీ పెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రశ్నించారు. అమెరికాలో అందరూ తమ పని తామే చేసుకుంటారని, అంతమాత్రాన దాన్ని అవహేళన చేయడం సరికాదని హితవు పలికారు. కేసీఆర్ తమను బాగా చదువుకోమని చెప్పారని, తాము అమెరికా వెళ్లి ఉన్నత చదువులు చదువుకున్నామని, తానేమీ ఆల్తూఫాల్తూగాన్ని కాదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఆశీస్సులతో 1983లో రాజకీయాలోకి వచ్చిన కేసీఆర్, 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి తదనంతరం మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా, కేంద్ర మంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం గడించారని గుర్తుచేశారు. విమర్శలు మాని ఇప్పటికైనా ప్రజాపాలనపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# స్మిత్ మచ్చర్‌కు రాష్ట్ర పురస్కారాన్ని ప్రకటించిన గుజరాత్

**గుజరాత్ :** దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు 174 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫ్లైదుబాయ్ (FZ1073) విమానంలో బుధవారం కాక్‌పిట్‌లో ఒక్కసారిగా తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆ క్లిష్ట సమయంలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి పెద్ద ప్రమాదాన్ని తప్పించిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు 'విశిష్ట గుజరాత్ గరిమా అవార్డు' అందజేస్తామని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ప్రకటించారు. ముంబైలో స్థిరపడిన గుజరాత్ మూలాలున్న కెప్టెన్ స్మిత్, తీవ్ర గాయాలపాలైనప్పటికీ ఎంతో సమయస్ఫూర్తితో కాక్‌పిట్ తలుపులు తెరవడంలో సహాయపడ్డారు. దీనివల్ల ప్రయాణికులు, ఇతర సిబ్బంది లోపలికి ప్రవేశించి దాడి చేసిన వ్యక్తిని అదుపు చేయగలిగారు. ఆ తర్వాత విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు.కెప్టెన్ స్మిత్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు, మానవత్వం వల్ల ఒక పెద్ద విపత్తు తప్పిందని సీఎం భూపేంద్ర పటేల్ కొనియాడారు. ఆయన చర్యలు గుజరాత్‌కే కాకుండా దేశమంతటికీ గర్వకారణమని, ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని రాష్ట్ర ప్రజలంతా ప్రార్థిస్తున్నారని పేర్కొన్నారు. కాగా.. ప్రస-్తుతం ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అత్యవసర సమయంలో స్మిత్ చూపిన చొరవను భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా స్మిత్ పై ప్రశంసల వర్షం కురిపించారు.

# నేరేడుగొమ్ము అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

**నేరేడుగొమ్ము,ఫ్లాష్ ఇండియా :** నేరేడుగొమ్ము మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నూతన గ్రామ శాఖ అధ్యక్షులను సన్మానించి, బీఆర్ఎస్ నేతలను పార్టీలోకి ఆహ్వానించారు.మండల కేంద్రంలో వీబీజీఆర్ఏఎంజీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలతో అండర్‌డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవ-సరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో గొర్ల ధనలక్ష్మి--ఆంజనేయులు, చిల్లా అనూష--ఆంజనేయులు, వరికుప్పల వెంకటమ్మ--కాశయ్య, వరికుప్పల మహేశ్వరి--వెంకన్న, హనుమంతు ఈదమ్మ--ఈదయ్య, నాగటి శారద--కృష్ణయ్య కుటుంబాలు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2026--27 బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి రూ.5,500 కోట్లు కేటాయించిందని వివరించారు.

**కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నేతలు..**

మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నేరేడుగొమ్ము, పందిరిగుండుతండా, జోడుబావి తండా, చర్లతండా గ్రామాలకు నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను



ఎమ్మెల్యే బాలు నాయక్ అభినందించి సన్మానించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ప్రతి గ్రామంలో పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నేరేడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు బొమ్మనోని లింగయ్య, సీనియర్ నాయకుడు బైకని సాలయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాలు నాయక్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లుగా బీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ తమ ప్రాంతానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందలేదని, పార్టీలో తగిన ప్రాధాన్యత కూడా లభించలేదని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఎమ్మెల్యే బాలు నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు.నేరేడుగొమ్ము చిన్న మండలమైనప్పటికీ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ అందించిన మండలాల్లో ఒకటిగా నిలిచిందని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రజలు తనపై, కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు, విద్యుత్ పాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

**నిబంధన.. కింది స్థాయి సిబ్బందికి మరో నిబంధనా?**

నేరేడుగొమ్ము గ్రామ పరిధిలోని 630 సర్వే నంబర్‌లో భూములు కలిగిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన నిజమైన రైతులకు పట్టాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెల్లిపాకుల రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.అనంతరం నేరేడుగొమ్ము మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలు నాయక్ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా, పారదర్శకంగా అందేలా బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మండల అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్, జిల్లా కార్యదర్శి లోకసాని కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ పులికంటి సుధాకర్, కోతి యుగంధర్ రెడ్డి, వాంకునావత్ పాపా నాయక్, గిరి యాదయ్య గౌడ్, గడ్డం వెంకటయ్య, కొప్పుల సురేందర్ రెడ్డి, ఎలిజర్ల శ్రీను, నీలం ఆంజనేయులు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# గుండెంగ గ్రామంలో పోషణ మాసోత్సవం...

**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు మండలం గుండె గ్రామం సెక్టార్ పరిధిలో పోషణ మాసం సందర్భంగా గ్రామ సర్పంచ్ బోడ రాజమ్మ. సిడిపిఓ నీలిమ. ముఖ్య అతిథిగా విచ్చేసి గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు నిర్వహించే చిన్నారులకు అన్న ప్రసన్నలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన వెయ్యి రోజుల ప్రజా సంక్షేమ పథకాల ప్రాముఖ్యత గురించి వివరించి తెలంగాణ సాంస్కృతి కి అద్దం పట్టే తొలి రోజు బొడ్డెమ్మ ను కూరగాయలతో అందంగా పేర్చి సంబురాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మంజుల. గ్రామ ఉపసర్పంచ్ జీ మంజుల. ఏఎన్ఎం భాగ్యమ్మ. అంగన్వాడి టీచర్లు. మహిళలు పాల్గొన్నారు.

# మరణించిన గొర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల ప్రాంతంలో మంగళవారం రైలు ప్రమాదంలో 350 మరణించిన గొర్లకు ప్రభుత్వం ఎక్స్గ్రేసి అందించాలని జిల్లా గొర్ల పెంపకం దారుల యూనియన్ మాజీ ఉపాధ్యక్షులు, యాదవ హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేల్పుల యాద మల్లయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాదిత గొర్ల కాపరి కృష్ణయ్యను పరామర్శించి అనంతరం ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన గొర్రెల వలన కాపరికి సుమారు 50 లక్షల నష్టం



వాటిల్లిందని, నష్టపోయిన గొర్ల కాపరికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, పూర్తి సబ్సిడీతో బాధిత గొర్ల కాపరికి 350 గొర్రెలను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి గొర్ల కాపరికి ఇన్సూరెన్స్ తో పాటు గొర్లకు ఉచిత ఇన్సూరెన్స్ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## సంపాదకీయం




# యువత భవిష్యత్తుతో చెలగాటం వద్దు

ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం ఒక ఉద్యోగం కాదు. ఒక కుటుంబానికి భద్రత, ఒక యువకుడికి భవిష్యత్తు, తల్లిదండ్రులకు జీవితకాల ఆశ. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖ వంటి ప్రజల ప్రాణాలతో నేరుగా సంబంధం ఉన్న విభాగంలో ఉద్యోగం పొందాలనే ఆకాంక్ష మరింత ఎక్కువగా ఉంటుంది. అలాంటి ఆశలను ఆసరాగా చేసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపించడం కేవలం ఒక శాఖకు సంబంధించిన సమస్యగా చూడలేం. ఇది నిరుద్యోగ యువతలో పెరుగుతున్న ఆందోళన, వ్యవస్థపై నమ్మకం, నియామక ప్రక్రియ పారదర్శకతపై సమాజం అడగాల్సిన ప్రశ్నలను ముందుకు తెస్తున్న అంశం.వరంగల్, హన్మకొండ జిల్లాల పరిధిలో ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ పోస్టులు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు అభ్యర్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. మెరిట్‌తో సంబంధం లేకుండా డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తామంటూ అభ్యర్థులను నమ్మబలుకుతున్నారనే ప్రచారం మరింత ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మధ్యవర్తిగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా రావడంతో ఈ వ్యవహారంపై అనుమానాలు మరింత పెరిగాయి.అయితే ఆరోపణలు వచ్చినంత మాత్రాన అవి నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేం. సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రాష్ట్రస్థాయి విచారణ జరుగుతోందని అధికారులు వెల్లడించిన నేపథ్యంలో.. విచారణ నిష్పాక్షికంగా, వేగంగా సాగి వాస్తవాలు బయటపడటం అత్యంత కీలకం. తప్పు చేసిన వారు ఎవరైనా చర్యలు తప్పక ఉండాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా వ్యక్తులపై ఆరోపణలు మోపకుండా చట్టపరమైన ప్రక్రియను గౌరవించాల్సిన బాధ్యత కూడా సమాజంపై ఉంది.ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన విషయం అధికారుల హెచ్చరిక. వరంగల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ బీ. రాజారెడ్డి దళారులను నమ్మి ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. నియామకాలు నిబంధనల ప్రకారమే జరుగుతాయని, జిల్లా పరిధిలో ప్రస్తుతం ఎలాంటి నియామకాలు చేపట్టలేదని తెలిపారు. భవిష్యత్తులో నోటిఫికేషన్ వెలువడితే మెరిట్ ఆధారంగా పారదర్శకంగా నియామక ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. ఈ స్పష్టత అభ్యర్థులకు ఒక ముఖ్యమైన సందేశం.ఎందుకంటే ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసాలు జరగడానికి ప్రధాన కారణం అభ్యర్థుల్లో ఉన్న ఆతృత. సంవత్సరాల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతలో ఉద్యోగం ఎప్పుడు వస్తుందో అన్న అనిశ్చితి ఉంటుంది. నోటిఫికేషన్ వస్తే వేలాది మంది పోటీ పడతారు. ఈ పరిస్థితిని కొందరు దళారులు తమకు అనుకూలంగా మలుచుకుంటారు. 'అధికారులతో పరిచయం ఉంది', 'పోస్టింగ్ ఇప్పిస్తాం', 'మెరిట్ అవసరం లేదు', 'డబ్బులు ఇస్తే ఉద్యోగం ఖాయం' వంటి మాటలతో అభ్యర్థులను ఆకర్షిస్తారు. ఒకసారి నమ్మకం కలిగితే లక్షల రూపాయలు డిమాండ్ చేస్తారు.ఇక్కడ నష్టపోయేది కేవలం డబ్బు కాదు. ఒక కుటుంబం సంవత్సరాలుగా కూడబెట్టుకున్న సొమ్ము పోవచ్చు. అప్పులు చేసి డబ్బు ఇచ్చిన కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోవచ్చు. అంతకంటే ముఖ్యంగా, యువతలో వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుంది. 'మెరిట్‌తో ఉద్యోగం రాదు', 'డబ్బు ఉంటేనే ఉద్యోగం' అనే భావన బలపడితే అది సమాజానికి అత్యంత ప్రమాదకరం.ప్రభుత్వ నియామక ప్రక్రియలో పారదర్శకత అందుకే కీలకం. ఏ పోస్టులకు ఎన్ని ఖాళీలు ఉన్నాయి? అర్హతలు ఏమిటి? దరఖాస్తుల స్వీకరణ ఎప్పుడు? మెరిట్ జాబితా ఎలా రూపొందుతుంది? ఎంపికైన అభ్యర్థుల వివరాలు ఎక్కడ ప్రకటిస్తారు? పోస్టింగ్ ప్రక్రియ ఎలా జరుగుతుంది? వంటి అంశాలను అధికారికంగా, ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా వెల్లడించాలి. సమాచారం ఎంత పారదర్శకంగా ఉంటే దళారులకు అంత తక్కువ అవకాశం ఉంటుంది.అలాగే అభ్యర్థులు కూడా జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన ఏ నియామకమైనా అధికారిక నోటిఫికేషన్, అధికారిక వెబ్‌సైట్, సంబంధిత శాఖ ప్రకటనల ద్వారానే నిర్ధారించుకోవాలి. వ్యక్తిగత పరిచయాలు, యూనియన్ పేర్లు, రాజకీయ పరిచయాలు, అధికారులతో సాన్నిహిత్యం వంటి మాటలను నమ్మి డబ్బులు చెల్లించడం ప్రమాదకరం. ఎవరు ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బు అడిగినా.. ముందుగా అధికారిక నియామక ప్రక్రియ ఉందా లేదా అన్నది నిర్ధారించుకోవాలి. డబ్బు చెల్లించే ముందు ఫిర్యాదు చేసే చట్టబద్ధ మార్గాలను తెలుసుకోవాలి.ఇక అధికార యంత్రాంగం బాధ్యత మరింత పెద్దది. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే వ్యక్తి తన హోదాను ఉపయోగించి అభ్యర్థులను ప్రభావితం చేస్తున్నాడనే ఆరోపణ వచ్చినప్పుడు.. దానిపై అంతర్గత విచారణ మాత్రమే కాకుండా అవసరమైన చోట స్వతంత్ర దర్యాప్తు కూడా జరగాలి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే సంబంధిత ఉద్యోగులకు న్యాయం చేయాలి. రెండింటిలోనూ పారదర్శకత తప్పనిసరి.వైద్య ఆరోగ్య శాఖలో నియమితులయ్యే సిబ్బంది ప్రజల ఆరోగ్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తారు. అలాంటి పోస్టులు డబ్బుతో కొనుగోలు చేయగలమనే భావన ఏర్పడితే.. అది ఉద్యోగ నియామక వ్యవస్థకే కాదు, ప్రజా ఆరోగ్య వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. అందుకే ఈ అంశాన్ని కేవలం 'ఉద్యోగ మోసం'గా కాకుండా ప్రజా పరిపాలనలో నైతికతకు సంబంధించిన సమస్యగా చూడాలి.ప్రభుత్వ ఉద్యోగం ఎవరి దయతో వచ్చేది కాదు. అది అర్హత, మెరిట్, నిబంధనల ఆధారంగా లభించాల్సిన ప్రజా అవకాశము. ఆ అవకాశాన్ని డబ్బుకు అమ్మే ప్రయత్నం జరిగితే అది యువత ఆశలను మాత్రమే కాదు.. సమాజం నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది.అందుకే వరంగల్--హన్మకొండలో వినిపిస్తున్న ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలి. వాస్తవాలు బయటకు రావాలి. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు నిలబడాలి. అదే సమయంలో అభ్యర్థులు కూడా దళారుల మాటలకు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం కూడా నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, డిజిటల్‌గా, ప్రజలకు అందుబాటులో ఉండేలా రూపొందించాలి.యువతకు ఉద్యోగం ఒక ఆశ. ఆ ఆశను వ్యాపారంగా మార్చే ఏ వ్యవస్థకైనా సమాజం అడ్డుకట్ట వేయాలి. ఉద్యోగం అమ్మకానికి పెట్టే వస్తువు కాదు.. అది ప్రతిభకు దక్కాల్సిన హక్కు.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న సీఈసీ ..

భారతదేశంలో ఎన్నికలు నిర్వహించేందుకు స్వతంత్ర ప్రతిపత్తితో ఏర్పాటుచేసిన సంస్థ భారత ఎన్నికల సంఘం. దేశంలో పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికలు నిర్వహించే స్వయంప్రతిపత్తి గల రాజ్యాంగ సంస్థ.ఓటర్ల జాబితా తయారీ, సవరణ ప్రక్రియ, పర్యవేక్షణ, రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్, ఎన్నికల గుర్తులు కేటాయింపులు ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యతలు. అయితే ఇటీవల కాలంలో ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న నిర్ణయాలపై అనేక అనుమానాలు వస్తున్నాయి.పారదర్శకంగా, నిష్పక్షపాతంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘానికి మకిలి అంటింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి అప్రజాస్వామిక నిర్ణయాలతో రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును కూడా నిర్దాక్షిణ్యంగా చోరీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటికే తోటి కమిషనర్ల విశ్వాసాన్ని కోల్పోయిన భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ప్రతిపక్షాలతోపాటు అధిక సంఖ్యలో దేశ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈసీ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై విరుచుకుపడుతున్నారు. ఎన్నికలను పర్యవేక్షించే వ్యవస్థ ఇక ఎంతమాత్రం జ్ఞానేశ్‌కుమార్ చేతుల్లో ఉండరాదని ప్రతిపక్షాలు గట్టిగా కోరుకుంటున్నాయి.. తక్షణం పదవి నుంచి తప్పుకోవాలని నేతలు డిమాండ్ చేస్తున్నారు. వారు కోరుతున్నట్టుగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసినా ఎన్నికల సంఘం స్వతంత్రతను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. సీఈసీని తొలగించాలి.

### సర్ ప్రక్రియను నిలిపివేయాలి!

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై సర్వత్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఒక్క క్షణం కూడా ఆయన ఆ పదవిలో కొనసాగటానికి వీల్లేదని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. తాజాగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం.. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సందు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో.. ఓటర్ల నమోదు, ఓట్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల డేటా కమిషన్ పనితీరుకు సంబంధించిన నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇది ఏ రాజ్యాంగ సంస్థకైనా తీవ్రమైన పరిణామం. ముఖ్యంగా దేశాన్ని స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను నిర్వహించే బాధ్యత కలిగిన సంస్థ విషయంలో దీనిని తేలికగా తీసుకోలేం. కానీ, ఎన్నికల సంఘం మాత్రం తన పనితీరును సమర్థించుకుంది. నిర్ణయ ప్రక్రియలో భిన్నాభిప్రాయాలు, లిఖితపూర్వక అభిప్రాయాలు, అంతర్గత పరిశీలనలు సహజమేనని, చివరకు నిర్ణయాలు నిర్దేశిత విధానాల ప్రకారమే తీసుకున్నామని తెలిపింది. అయితే అసలు సమస్య ఈసీ పారదర్శకత, దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ( సర్ ) నేపథ్యంలో ఈ వివాదం ప్రాధాన్యత సంతరించుకుంది.

### వివాదాస్పదంగా ఓటర్లను తొలగించే ప్రక్రియ

అత్యంత వివాదాస్పదమైన సర్ ప్రక్రియకు సీఈసీ శ్రీకారం చుట్టారు. రాజ్యాంగ ఆశయాన్ని తుంగలో తొక్కి వీలైనంత మందిని ఓటుకు దూరంచేసే అప్రజాస్వామిక విధానం ఆయన హయాంలో జరుగుతున్నది. ఇప్పటికే 13 కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోయారు. ఈసీ అసమంజస విధానాల వల్ల ఓటు హక్కు కోల్పోతున్నవారిలో ప్రధానంగా మైనార్టీలు, పేదలు, వలస కార్మికులు ఉంటున్నారు. అధికారంలో ఉన్న కూటమికి మేలు జరిగేలా సర్ ప్రక్రియను అమలు చేస్తున్నారనడంలో సందేహం లేదు. పాలక పార్టీకి తొత్తుగా మారి ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాల్సిందే అనే డిమాండు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నది. ఓటర్ల జాబితాలో.. మరణించినవారి పేర్లు, వేరే ప్రాంతాలకు తరలిపోయివారు, అనర్హులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించి జాబితాలను ప్రక్షాళన చేయడాన్ని ఎవరూ తిరస్కరించలేరు.కానీ అసలు ప్రశ్న ఈ ప్రక్షాళన ఎంత పారదర్శకంగా జరుగుతుంది? అన్నదే. సర్ ప్రక్రియలు దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఈ తొలగింపులో చాలావరకు నిబంధనల ప్రకారం జరిగి ఉండవచ్చు. కానీ ఇంత భారీస్థాయిలో పేర్లు తొలగించినప్పుడు ప్రతి అర్హుడైన ఓటరుకు ధ్రువీకరణ అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం, అప్పీలు చేసుకునే సులభమైన విధానం ఉండటం అత్యవసరం.

### ఈసీ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి

అసలు ఆందోళన ఏమిటంటే.. ఆ అభ్యంతరాలను ఎలా పరిగణించారు? వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు? ప్రజలకు దాని గురించి ఎంతవరకు సమాచారం అందుతుంది? కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6 విధానంలో మార్పులు, పశ్చిమ బెంగాల్లో అప్పీల్ ప్రక్రియ వంటి అంశాలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి. ఇలాంటి విషయాల్లో రాజకీయ ఆరోపణలు కాకుండా స్పష్టమైన నియమాలు, ఆధారాలు, పత్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎన్నికల జాబితాలను అధికార పార్టీకి అనుకూలంగా మారుస్తున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీజేపీ ఎన్నికల సంఘం ఆరోపణలను ఖండిస్తున్నాయి. వాటికి ఆధారాలు అవసరం. ఎన్నికల సంఘం విశ్వసనీయత కేవలం ఎన్నికలను సకాలంలో నిర్వహించడంలో లేదు. ప్రజలు ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా విశ్వసించడంలో ఉంది. అందుకే ప్రస్తుత విధానాన్ని మరో రాజకీయ ఘర్షణగా చూడకుండా సంస్థాగత పారదర్శకతను పెంచుకునే అవకాశంగా ఎన్నికల సంఘం చూడాలి. ప్రధానంగా ఎన్నికల కమిషన్ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి.అంతర్గతంగా లేవనెత్తిన అభ్యంతరాలపై సాధ్యమైనంత వరకు పత్రాలు, విధానాలు, నిర్ణయాల వివరాలను ప్రజలకు ఈసీ వెల్లడించాలి. ఓటర్ల డేటా బేస్ భద్రత, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, అప్పీల్ ప్రక్రియలపై స్పష్టమైన జవాబులు ఇవ్వాలి. పారదర్శకమైన విధానాలు, చట్టబద్ధమైన నిర్ణయాలు స్వతంత్రంగా ఉండాలి.

### దేశవ్యాప్తంగా సీఈసీపై నిరసనలు

ఈ క్రమంలో తక్షణం సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు ఊరుకోబోమని ఇప్పటికే సీజేపీతో పాటు పలువురు హెచ్చరిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హైదరాబాద్‌లో, వివిధ రాష్ట్ర రాజధానులలోనూ ఇదే అంశంపై సమావేశాలు, సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు కొనసాగుతున్నాయి. అధికార పక్షం కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 28న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది. ఇదే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సెప్టెంబర్ 30న సీఈవో వద్ద ఆందోళనకు వామపక్షాలు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. అక్టోబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని వారు హెచ్చరించారు.

# ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఎఫెక్ట్..

రాజకీయాల్లో పదవి అనేది శాశ్వతం కాదు. అధికారం కూడా ఎప్పటికీ ఒకరి చేతిలో ఉండదు. నిన్నటి అధికార సమీకరణాలు రేపటికి మారిపోవచ్చు. అందుకే ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు, ప్రజలతో వ్యవహరించే తీరులో సంయమనం, సమన్వయం, గౌరవం అత్యంత కీలకం. కానీ రాజకీయాల్లో ఈ ప్రాథమిక సూత్రాలు మరుగునపడినప్పుడు.. పరిస్థితులు మారిన తర్వాత అదే వ్యక్తులు తమ పాత వైఖరికి భిన్నంగా వ్యవహరిస్తున్నారనే చర్చ మొదలవుతుంది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఇదే అంశాన్ని మరోసారి రాజకీయ చర్చకు తెచ్చాయి.దానం నాగేందర్ రాజకీయ ప్రయాణం ఇప్పుడు మరో కీలక మలుపులోకి ప్రవేశించింది. అనర్హత వేటు నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైన పరిస్థితి ఏర్పడటంతో ఆయన రాజకీయంగా కొత్త సవాల్‌ను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పెండింగ్ పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం వంటి అంశాలపై ఆయన దృష్టి పెరిగిందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది.ఇక్కడ అసలు చర్చ దానం నాగేందర్ పనులు చేయించుకోవడంపై కాదు. ఒక ప్రజాప్రతినిధి తన నియోజకవర్గానికి అభివృద్ధి తీసుకురావడానికి మంత్రులను, అధికారులను కలవడం సహజమైన రాజకీయ ప్రక్రియే. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిందే. అయితే గతంలో తనతో పనిచేసిన మంత్రులు, అధికారులతో ఆయన వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చకు రావడమే రాజకీయంగా ఆసక్తికరమైన అంశం.దానం నాగేందర్ గతంలో మంత్రుల పట్ల గౌరవంగా వ్యవహరించలేదని కొందరు కాంగ్రెస్ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం ఉంది. రాజకీయంగా తనకంటే జూనియర్లుగా భావించిన కొందరు మంత్రులను ఆయన పెద్దగా పట్టించుకునేవారు కాదనే ఆరోపణలు కూడా వినిపించాయి. అయితే ఇవి ప్రధానంగా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న వ్యాఖ్యలే తప్ప, ప్రతి సందర్భానికీ స్వతంత్ర ఆధారాలు ఉన్నాయనే నిర్ధారణ లేదు. అయినప్పటికీ ఈ చర్చ ఇప్పుడు బయటకు రావడానికి ఉపఎన్నిక రాజకీయ వాతావరణమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.ఇదే పరిస్థితి అధికార యంత్రాంగంతో సంబంధాల విషయంలోనూ కనిపిస్తోంది. గతంలో నిబంధనల విషయంలో ఒత్తిడి తెచ్చేవారని, ఫోన్‌లో కఠినంగా మాట్లాడేవారని కొందరు అధికారులు చెబుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు మాత్రం అదే అధికారులతో మర్యాదగా మాట్లాడుతున్నారని, పెండింగ్ పనులను ఎన్నికల షెడ్యూల్‌కు ముందే పూర్తి చేయాలని కోరుతున్నారని చెప్పుకుంటున్నారు. ఈ మార్పు నిజంగా జరిగిందా? జరిగితే దానికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నలు సహజంగానే రాజకీయ వర్గాల్లో తలెత్తుతున్నాయి.రాజకీయ నాయకుడి ప్రవర్తనలో మార్పు రావడం తప్పు కాదు. పరిస్థితులను బట్టి నాయకులు తమ విధానాలను మార్చుకోవడం రాజకీయాల్లో సాధారణమే. కానీ ఆ మార్పు ప్రజల కోసం జరిగిందా? లేక ఎన్నికల అవసరాల కోసమా? అన్నది ప్రజలు గమనించే అంశం. ఎందుకంటే ఎన్నికలు దగ్గరపడినప్పుడు మాత్రమే ప్రజా సమస్యలు, పెండింగ్ పనులు, అధికారులతో సమన్వయం గుర్తుకు వస్తే.. రాజకీయ నాయకత్వంపై సహజంగానే ప్రశ్నలు వస్తాయి.2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్ ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరడం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడం వంటి పరిణామాలు ఆయన రాజకీయ ప్రయాణంలో కీలక మలుపులు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి అనంతరం కూడా ఆయన రాజకీయ పాత్రపై చర్చ కొనసాగింది. ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నిక ఆ చర్చను మరింత తీవ్రం చేసింది.ఈ ఉపఎన్నిక కేవలం ఒక అసెంబ్లీ స్థానానికి జరిగే ఎన్నికగా మాత్రమే కాకుండా.. హైదరాబాద్ రాజకీయాల్లో పార్టీల బలాబలాలను అంచనా వేసే మరో సందర్భంగా మారే అవకాశం ఉంది. కాంగ్రెస్‌కు ఇది అధికారంలో ఉన్న పార్టీగా తన స్థానిక రాజకీయ వ్యవస్థను పరీక్షించుకునే సందర్భం. బీఆర్ఎస్‌కు గతంలో తన వద్ద ఉన్న సీటును తిరిగి సాధించే ప్రయత్నానికి అవకాశం. బీజేపీకి నగర రాజకీయాల్లో తన ప్రభావాన్ని చూపించుకునే మరో వేదిక. అందువల్ల దానం నాగేందర్ వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుతో పాటు ప్రధాన పార్టీల వ్యూహాలు కూడా ఈ ఉపఎన్నికలో కీలకం కానున్నాయి.అయితే ఎన్నికల రాజకీయాల్లో అత్యంత ముఖ్యమైన విషయం వ్యక్తుల మధ్య సంబంధాలు కాదు.. ప్రజల సమస్యలు. రోడ్లు, డ్రైనేజీ, ట్రాఫిక్, మంచినీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, స్థానిక అభివృద్ధి వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాధానాలు కావాలి. ఎన్నికల ముందు పనులు పూర్తి చేయడం కంటే, ఎన్నికలు ఉన్నా లేకపోయినా నియోజకవర్గ అభివృద్ధి నిరంతరం కొనసాగడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన విధానం.అధికారంలో ఉన్నప్పుడు అధికారులను ఒత్తిడికి గురిచేసి, అవసరం వచ్చినప్పుడు అదే అధికారులను ప్రసన్నం చేసుకోవడం ఏ నాయకుడికైనా దీర్ఘకాలిక రాజకీయ విశ్వసనీయతను ఇవ్వదు. అలాగే మంత్రులతో వ్యక్తిగత సంబంధాలను రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడం కంటే.. ప్రభుత్వ వ్యవస్థతో నిరంతర సమన్వయం కలిగి ఉండటం ప్రజా ప్రతినిధికి అవసరం.ఖైరతాబాద్ ఉపఎన్నిక నేపథ్యంలో దానం నాగేందర్ ముందున్న అసలు పరీక్ష ఇదే. గతంలో ఎలా వ్యవహరించారు అన్న చర్చను పక్కనపెట్టి.. ఇక ముందు ప్రజలతో, మంత్రులతో, అధికారులతో, పార్టీ సహచరులతో ఎలా వ్యవహరిస్తారన్నదే రాజకీయంగా ముఖ్యమైన అంశం. ఎన్నికల సమయంలో కనిపించే మార్పు తాత్కాలికమా? లేక ప్రజా ప్రయోజనాలపై స్థిరమైన దృక్పథానికి సంకేతమా? అన్నది కాలమే తేల్చాలి.ప్రజాస్వామ్యంలో పదవి కోసం ప్రజలు నాయకుడిని ఎన్నుకుంటారు. ఆ పదవితో వచ్చే అధికారాన్ని వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం కాకుండా ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడమే అసలైన రాజకీయ పరిపక్వత. పరిస్థితులు మారినప్పుడు మనుషుల పట్ల వైఖరి మారడం కంటే.. పరిస్థితులు ఎలా ఉన్నా ప్రజల పట్ల బాధ్యత మారకపోవడమే నాయకత్వానికి అసలైన కొలమానం. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఈ రాజకీయ సందేశాన్ని మరోసారి తెరపైకి తెస్తోంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఇన్‌స్టాగ్రామ్ రీల్.. టెలిగ్రామ్‌లో ట్రైనింగ్

## కట్ చేస్తే.. ఏకంగా దొంగ నోట్ల తయారీ



**గుజరాత్ :** సోషల్ మీడియా కొత్త నేరస్థులను తయారు చేస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. తాజాగా ఓ కూరగాయాల వ్యాపారి నకిలీ నోట్ల ముద్రణకు పాల్పడిన ఘటన గుజరాత్‌లోని రాజ్‌కోట్ లో వెలుగులోకి వచ్చింది. తక్కువ ఆదాయంతో అప్పులపాలైన నిందితుడు ఇన్‌స్టాగ్రామ్ రీల్ చూసి, టెలిగ్రామ్ ద్వారా శిక్షణ పొంది సొంతంగా నకిలీ నోట్లను ముద్రిస్తున్నట్లుగా రాజ్‌కోట్ సిటీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ పోలీసులు వెల్లడించారు. రాజ్‌కోట్ డీసీపీ క్రైమ్ జగదీష్ బంగర్వా కథనం మేరకు, మాందదుంగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో నకిలీ 100, 500 రూపాయల నోట్లను ముద్రిస్తున్న కిషన్ సోలంకి అనే కూరగాయల వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నివాసం భారీగా వంద, ఐదు వందల రూపాయల ఫేక్ నోలు, ప్రింటింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

**ఇన్‌స్టాగ్రామ్ రీల్ నుంచి టెలిగ్రామ్ ట్రైనింగ్ వరకు..**

ప్రాథమిక విచారణలో నిందితుడు కిషన్ సోలంకి కి తాను కూరగాయల వ్యాపారం చేస్తూ తక్కువ ఆదాయం కారణంగా అప్పులపాలైనట్లుగా పోలీసులకు తెలిపాడు. ఓ రోజు ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ స్క్రోల్ చేస్తుండగా నకిలీ 100, 500 వందల నోట్లు ఎలా తయారు చేయాలో చెబుతున్న రీల్ అతడి కంటపడింది. ఆ అకౌంట్ వెనుక ఉన్న వ్యక్తిని సంప్రదించిన కిషన్ సోలంకి, ఆ తర్వాత టెలిగ్రామ్ ద్వారా మాట్లాడాడు. టెలిగ్రామ్ చాట్ల ద్వారానే నకిలీ కరెన్సీ ముద్రించే విధానాన్ని పూర్తిగా నేర్చుకున్నాడు. తాను తయారు చేసిన 10 వేల రూపాయల విలువైన ఫేక్ నోట్లను ట్రైనింగ్ ఇచ్చి అతడికి ఇవ్వగా.. అందుకు ప్రతిగా ఆ ట్రైనర్ కిషన్ సోలంకి రూ.3 వేల రూపాయలు చెల్లించినట్లుగా పోలీసులకు వెల్లడించాడు. ఈ మేరకు నకిలీ నోట్ల ట్రైనింగ్ ఇచ్చిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

**సైలెంట్‌గా ఫేక్ నోట్ల చలామణి..**

పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రిలో సీపీయూ , మానిటర్, రెండు ప్రింటర్లు, లామినేటర్ హీటర్ మెషిన్, బటర్ పేపర్ , వంద రూపాయల డినామినేషన్ ముద్రించిన కాగితాలు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న ఈ మొత్తం సామగ్రి, నకిలీ కరెన్సీ విలువ రూ.65,500 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. కిషన్ సోలంకి నకిలీ కరెన్సీని ఎవరికీ బల్క్‌గా విక్రయించలేదని, వివిధ ప్రాంతాల్లో చిన్న కొనుగోళ్లు చేస్తూ తానే స్వయంగా నోట్లను చలామణి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటి నిందితుడు కిషన్ సోలంకి వరకు ఎంత మొత్తంలో నోట్లు ముద్రించాడు, ఎక్కడెక్కడ చలామణి చేశాడనే దానిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడికి కోర్టు 3 రోజు రిమాండ్ విధించింది.



## ఫామ్ -6 మార్పు ఆదేశాలు ఎవరిచ్చారు?

**ఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేళ ఫారం-6 చుట్టూ వివాదం కొనసాగుతున్న వేళ ఇందులో మార్పులపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా మార్చారు? ఈసీ సొంత కమిషనర్లే ఈ విషయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మరి ఈసీఐలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు ఆ మార్పు చేయమని ఎవరు ఆదేశించారు? టీసీఎస్‌లో ఎవరు దానికి ఆమోదం తెలిపారు? అలా చేయడానికి వారిపై ఒత్తిడి తెచ్చారా? అని గాంధీ గురువారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

**అసలేంటి ఈ తాజా వివాదం:**

ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే ఓటర్లు ఇక నుంచీ ఫారం-6 కు అదనంగా డిక్లరేషన్ ఫారాన్ని నింపడాన్ని ఈసీ అధికారికంగా ఉపసంహరించుకుంది. అంతకు ముందు ఎస్ఐఆర్ సందర్భంగా కొత్తగా దరఖాస్తు చేసుకునే ఓటర్లు తమ తండ్రి, తాతల పేర్లను వెల్లడించాలని పేర్కొంటూ ఫారం-6కు అదనంగా డిక్లరేషన్‌ను ఈసీ జోడించింది. ఎస్ఐఆర్ సందర్భంగా తీసుకొచ్చిన ఈ నిబంధనపై ఇద్దరు కమిషనర్లు ఎస్ఎస్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరం వ్యక్తం చేశారంటూ ఓ జాతీయ పత్రికలో వచ్చిన పరిశోధనాత్మక కథనంతో ఈ అంశంపై తీవ్ర వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో 26వ తేదీన సమావేశమైన ఈసీ సర్ కోసమే ఈ ఫారాన్ని తెచ్చామని సర్ అమల్లో లేని సమయంలో 1960 నాటి ఓటరు నమోదు నిబంధనలకు అనుగుణంగా ఫారం-6ను నింపితే చాలని పేర్కొంది. అంతేకాకుండా సర్ ముగిసిన ప్రాంతాల్లో ఈసీఐనెట్ పోర్టల్, యాప్‌లతో పాటు సీఈఓ వెబ్‌సైట్ల నుండి కూడా ఈ డిక్లరేషన్‌ను తొలగించామని పేర్కొంది. ఆన్ లైన్ లో ఫారం 6 పై జరిగిన మార్పులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారని రాహుల్ ప్రశ్నించారు.

# ఎర్రవల్లి భూ సర్వే నివేదిక రెడీ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి గ్రామం భూ సర్వే నివేదిక సిద్ధమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖల నుంచి అందిన ఈ సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ హైమావతి ఇవాళ ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఈ సర్వే నివేదికలో పొందుపరిచిన అంశాలు, వెల్లడయ్యే వివరాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎర్రవల్లి భూములకు సంబంధించి చేపట్టిన సర్వే రిపోర్టును అధికారులు ఇప్పటికే కలెక్టర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో నేడు ఈ నివేదికను అధికారికంగా ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

**పలువురికి నోటీసులు...**

అయితే, ఈ సర్వే ప్రక్రియలో ఎర్రవల్లి శివారులోని వెంకటాపూర్ గ్రామస్థులు లేవనెత్తిన అభ్యంతరాలు, విజ్ఞప్తులను అధికారులు పరిగణలోకి తీసుకోలేదనే చర్చ జరుగుతోంది. ఎర్రవల్లిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాలు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో అధికారులు సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 325లో 244 మంది అనుభవదారులకు, వెలికట్టలోని సర్వే నంబర్ 271లో ఉన్న 118 మంది అనుభవదారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయా భూముల్లో పొజిషన్ సర్వే నిర్వహించారు. అయితే, స్థానిక ప్రజల వాదనలను పక్కనపెట్టి నివేదిక రూపొందించారనే ప్రచారం స్థానికంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రభుత్వానికి అందజేయనున్న ఈ నివేదిక ఆధారంగా రానున్న రోజుల్లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోనున్నారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది. కాగా.. ఇటీవల అసెంబ్లీ వేదికగా సిద్దిపేట జిల్లా మార్కుక్ మండల పరిధిలోని భూముల లెక్కలను తేల్చాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రంగంలోకి దిగిన రెవెన్యూ అధికారులు.. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో సర్వే చేపట్టారు. ఎర్రవల్లిలోని 325 సర్వే నంబర్‌లోని 388 ఎకరాల భూముల్లో సర్వే నిర్వహించారు. అలాగే వెలికట్ట గ్రామంలోనూ సర్వే చేశారు. భారీ బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు ఈ ప్రక్రియను చేపట్టి భూముల సర్వేను పూర్తి చేశారు.

# రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ప్రైవేటుపరం




**ఇబ్రహీంపట్నం,ఫ్లాష్ ఇండియా :** ఓవైపు రాష్ట్రంలో భూ సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల రచ్చ కొనసాగుతోన్న వేళ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ జరిగిన భారీ అక్రమం వెలుగులోకి వచ్చింది. ఏకంగా తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తి పేరున పట్టా చేసిన వైనం తీవ్ర కలకలం రేపుతోంది. కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంపై రెవెన్యూ వర్గాల్లో, స్థానికంగా సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**మంగళ్‌పల్లిలో ప్రభుత్వ భూమికి దర్జాగా పట్టా**

ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మంగళ్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర బట్టబయలైంది. మంగళ్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ భూమిలో 4.25 ఎకరాలను వహీదా బేగం అనే ప్రైవేటు వ్యక్తి పేరుతో అక్రమంగా పట్టా చేశారు. దీనికి సంబంధించి అధికారికంగా పట్టా పాసుపుస్తకం కూడా జారీ చేయడం సంచలనం సృష్టించింది. అసలు ప్రభుత్వ భూమికి ఎలాంటి హక్కులు లేకపోయినా, అధికారిక రికార్డుల్లో మార్పులు చేసి ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టడంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

**ఫోర్జరీతో రూ.50 కోట్ల విలువైన ఆస్తికి ఎసరు..**

అయితే, మొత్తం వ్యవహారం నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లుగా ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో ఏకంగా తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలు సృష్టించినట్లుగా అధికారులు గుర్తించారు. ఆ ఫోర్జరీ సంతకంతోనే వహీదా బేగం పేరు మీద రికార్డుల్లో మార్పులు చేసి పాసుపుస్తకం జారీ చేసినట్లుగా వెల్లడైంది. ఈ భూమి మార్కెట్ విలువ ప్రస్తుతం సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ భూమికి పట్టా ఎలా జారీ చేశారన్న దానిపై, భూ రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయన్న దానిపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తవవుతున్నాయి. ఈ భారీ గోల్‌మాల్‌పై రెవెన్యూ అధికారులు ఫోకస్ పెట్టారు. అసలు ఆ భూమి స్వభావం, పాత రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తిరగేస్తున్నారు. ప్రభుత్వ భూమికి సంబంధించి రికార్డుల్లో అక్రమ మార్పులు ఎలా జరిగాయనే కోణంలో విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన పట్టాదారు పాస్‌బుక్కును వెంటనే రద్దు చేయాలని కోరంతూ ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి.

# దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు



**హిమాయత్ నగర్,ఫ్లాష్ ఇండియా :** నగరంలో ఓట్ల తొలగింపు వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. ఈ అంశంపై మాజీ మంత్రి దానం నాగేందర్ ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తన వైఖరి మార్చుకోకపోతే ఈసీ కార్యాలయంతో పాటు హైదరాబాద్ నగరాన్ని తగలబెడతామని ఆయన తీవ్రమైన హెచ్చరికలు చేశారు. హిమాయత్ నగర్ డివిజన్‌లో సీసీ రోడ్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

**బీజేపీతో ఈసీ కుమ్మక్కు.. 'ఓట్ చోరీ' ఆరోపణలు**

ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ అధికారులు బీజేపీతో కుమ్మక్కై, వారికి అనుబంధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కేవలం హిమాయత్ నగర్ డివిజన్‌లోనే దాదాపు 20 వేల వరకు ఓట్లను ఏకపక్షంగా తొలగించారని మండిపడ్డారు. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు వ్యవస్థీకృతమైన 'ఓట్ చోరీ'కి పాల్పడుతున్నారని విమర్శించారు. తన నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్కరి ఓటును కాపాడుకునే పూర్తి బాధ్యత తనపై ఉందని దానం స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా స్థానికంగా ఉంటున్న ప్రజల ఓట్లను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**తక్షణమే పునరుద్ధరించాలి..**

ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి, తొలగించిన ఓట్లను యథావిధిగా పునరుద్ధరించాలని దానం నాగేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ నిరసనలు, పోరాటాలు మరింత ఉధృతంగా ఉంటాయని, ప్రభుత్వానికి, ఈసీకి వ్యతిరేకంగా తీవ్ర ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్షమాపణలు చెప్పి, లెంపలు వేసుకోండి చంద్రబాబు



**ఆంధ్రప్రదేశ్ :** "బీసీలపై నయవంచనతో కూడిన రాజకీయాలు ఇంకా ఎన్నాళ్లు చేస్తారు?, ఇంకా ఎన్నాళ్లు వారిని మభ్యపెట్టి మోసం చేయాలనుకుంటున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అంటూ డ్రామా చేస్తున్నారని మీకూ తెలుసు?, సుప్రీంకోర్టు గత తీర్పుల వల్ల అది ఏ కోర్టులోనూ నిలబడదని కూడా మీకు తెలుసు?, కోర్టులో నిలబడదని తెలిసీ, 44 రోజులుగా మీరు చేసింది కపట నాటకం కాదా?, ఇవాళ మీరిచ్చిన జీవోలను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బీసీలకు క్షమాపణలు చెప్పి, లెంపలు వేసుకోండి చంద్రబాబు." అని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ట్వీట్ ద్వారా డిమాండ్ చేశారు. చంద్రబాబుగారూ.. "నిజంగా మీకు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధి ఉంటే.. మీరు చేయాల్సింది కేంద్రంలో ఉన్న మీ కూటమి ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి ఆ మేరకు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఒక మార్గాన్ని తీసుకొస్తే గాని, ఈ రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదు. మరి ఆ దిశగా మీరు ఏం చేశారు? కేంద్రంతో మాట్లాడారా? కనీసం మీ కేంద్ర మంత్రులతో అక్కడి కేబినెట్ సమావేశాల్లో ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేశారా? మీరు ఢిల్లీ వెళ్లినప్పుడు ఎన్నిసార్లు దీనిపై కేంద్రంతో చర్చించారు? ఇవి చేయకుండా, చెల్లని జీవోలు ఇచ్చి డ్రామాలు చేయడం వెనుక మీ ఉద్దేశం, బీసీలను మభ్య పెట్టి, మోసం చేయాలనే కదా? రాజకీయ స్వార్థం కోసం మీ డ్రామాలు ప్రదర్శించడానికి బీసీలే కావాల్సి వచ్చారా?" అని మాజీ సీఎం జగన్ ప్రశ్నించారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు..



**అమరావతి,ఫ్లాష్ ఇండియా :** బీసీ రిజర్వేషన్లపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ వ్యవహారానికి సంబంధించి అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌తో పాటు సీనియర్ న్యాయనిపుణులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వచ్చే సోమవారంలోపు అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈలోపు బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు వైసీపీ చేసిన ప్రయత్నాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. ఢిల్లీలో ప్రభుత్వం వేసే పిటిషన్‌పై వాదించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులను నియమించాలని సీఎం ఆదేశించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. కాగా.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. 6 వారాల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఎన్నికల కమిషన్, ఏపీ ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. దీంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంలో పోరాడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**అందుకే సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం: చింతకాయల విజయ్**

స్థానిక ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ జీవోలను హైకోర్టు కొట్టివేయడంతో సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు టీడీపీ రాజ్యసభసభ్యుడు చింతకాయల విజయ్ తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే నిర్ణయానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లి పోరాడుతామని అన్నారు. బీసీల రిజర్వేషన్‌పై కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను రద్దు చేయించాలని వైసీపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లపై వైసీపీకి చెందిన వ్యక్తులు హైకోర్టుకు వెళ్లారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కూడా బీసీలకు రిజర్వేషన్లపై జగన్ సుప్రీంకోర్టుకు వెళ్లలేదని... బీసీలకు కేవలం 24 శాతం రిజర్వేషన్ మాత్రమే కల్పించారని అన్నారు. దీని వల్ల బీసీలు సుమారు 18 వేల పదవులు కోల్పోయారని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేత చంద్రయ్యను నడిరోడ్డుపై నరికేశారని విజయ్ గుర్తుచేశారు. రేపల్లె నియోజకవర్గంలో అమరనాథ్ గౌడ్ అనే విద్యార్థిని సజీవ దహనం చేశారన్నారు. బీసీలను వైసీపీ నేతలు వెంటాడి వేధించారని, అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను అణగదొక్కాలని వైసీపీ ప్రభుత్వం అప్పట్లో పనిచేసిందని దుయ్యబట్టారు. అందుకే 2024 ఎన్నికలలో వైసీపీకి బీసీలతో పాటు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. బీసీలకు.. జనాభాకు అనుగుణంగా పదవులు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు గుర్తింపు తీసుకువచ్చింది, రాజ్యాధికారంలో వాళ్లను భాగస్వామ్యులను చేసింది టీడీపీనే అని తెలిపారు. అందుకే సుప్రీంకోర్టుకు వెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని చింతకాయల విజయ్ పేర్కొన్నారు.

## ఇసుక తవ్వకాలతో.. భూగర్భ జలాలకు ఎసరు !



**బషీరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బషీరాబాద్ మండల పరిధిలోని నావంద్గి గ్రామ సమీపంలోని కాగ్నా నదిలో ఇసుక తవ్వకాలు కలకలం రేపుతున్నాయి. ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని బుధవారం తహసీల్దార్ షాహీదా బేగంకు ఫిర్యాదు చేసినప్పటికీ, మళ్లీ అనుమతులు ఇచ్చారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు కాగ్నా నది వద్దకు చేరుకుని ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. తమ గ్రామం నుంచి గంపెడు ఇసుక కూడా తరలించనివ్వబోమంటూ నది వద్ద రోడ్డుకు అడ్డంగా కూర్చొని ఆందోళన చేపట్టారు. నదిలో ఇసుకను అధికంగా తోడేస్తుండటంతో తమ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న బోర్లు ఒక్కొక్కటిగా ఎండిపోతున్నాయని వాపోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక తవ్వకాల వల్ల తమ వ్యవసాయానికి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. నదిలో ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేసి, భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

# ఎల్‌నినోపై ఐఎండీ అంచనా

## ఈ శీతాకాలం చాలా హాట్ గురు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశంలో నైరుతి రుతుపవనాల కాలం ముగిసిందని భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది వర్షాకాలం మొత్తంగా 13 శాతం లోటు వర్షపాతంతో ముగిసిపోగా ఇవాళ్టి నుంచి శీతాకాలం ప్రారంభమైంది. ఇక ఎల్ నినో ప్రభావంతో ఈ శీతాకాలం హాట్ హాట్‌గా ఉండబోతోందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. రాబోయే అక్టోబర్ - డిసెంబర్‌లోనూ చలితీవ్రత తక్కువగా నమోదుకానుందని దీంతో అక్టోబరులో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సెప్టెంబర్ మధ్యలోనే ఎండాకాలాన్ని తలపించిన వాతావరణం రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**దక్షిణ భారతదేశానికి ఊరట:**

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దేశంలో అత్యధిక ప్రాంతాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండనుందని, దేశమంతటా పొడి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ దక్షిణ భారతంలో అక్టోబర్--డిసెంబర్ కాలానికి సాధారణ వర్షపాతం నమోదు కావచ్చని పేర్కొంది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు ఈ మూడు నెలల్లో దీర్ఘకాలిక సగటు(334.1 మి.మీ.) కాగా ఇందులో 88 శాతం నుంచి 122 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో దక్షిణాదిలోని తమిళనాడు, రాయలసీమ, కోస్తాంధ్ర, కేరళ, దక్షిణ కర్ణాటకల్లో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. .

**రికార్డు స్థాయిలో బలపడుతున్న ఎల్ నినో:**

పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడెక్కడం వల్ల ఏర్పడే ఎల్ నినో ఈ ఏడాది అత్యంత వేగంగా విస్తరిస్తోందని ఐఎండీ హెచ్చరించింది. ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లైమేట్ అండ్ సొసైటీ నివేదిక ప్రకారం, సెప్టెంబర్ నాటికి సముద్ర ఉష్ణోగ్రతల్లో +3°C పెరుగుదల నమోదు కానుందని పేర్కొంది. ఈ తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులు శీతాకాలమంతా కొనసాగి 2027 ప్రారంభం వరకు ప్రభావం చూపే అవకాశం ఉందని వివిధ వాతావరణ నమూనాలు స్పష్టం చేస్తున్నాయి.

# నిరుపయోగం గా మిగిలిన చెక్ డ్యామ్



**మోతె,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మోతె మండలం కూడలి గ్రామంలో శ్రీ సంఘమేశ్వర స్వామి దేవాలయం దిగువన రెండు ఏర్ల సంఘమం వద్ద వృధా గా పోతున్న నీటిని సాగు, త్రాగు నీటి కి మరలించడం కోసం గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం 2019 లో సుమారు 2.40 కోట్ల తో చెక్ డ్యామ్ నిర్మించడం జరిగింది ఇట్టి చెక్ డ్యామ్ గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించాక పోవడం మరియు సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల అదే సంవత్సరం వచ్చిన ఏటిలో వరద ప్రవాహానికి సుమారు 40 మీటర్ల వరకు కొట్టుకోవడం పోవడం జరిగింది

**రైతులు ఆవేదన...**

ఇట్టి చెక్ డ్యామ్ లో నీరు నిలవక పోవడం వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయింది అని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెక్ డ్యామ్ ని మ-రమ్మత్తులు చేసి పూర్తి స్థాయి లో నీరు నిల్వ ఉండేలాగా చేయాలనీ చుట్టుపక్కల మూడు గ్రామాల ఈ చెక్ డాంపై ఆధారపడిన రైతులు కోరుతున్నారు

# గూడూరు పోలీసులు గుడుంబా పై ఉక్కు పాదం..



**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గూడూరు పోలీస్ వారి ఆధ్వర్యంలో రాములు తండా. చిర్రకుంట తండా గ్రామాల్లో గురువారం పోలీసులు గుడుంబా పై ఉక్కు పాదం మోపారు ఐదు గంటల 30 నిమిషాల నుండి ఏడు గంటల 30 నిమిషాల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు ఈ కార్యక్రమంలో 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని రెండు గ్రామాల్లోని సుమారు 200 ఇండ్లు సందర్శించి సరైన ధ్రువపత్రాలు నెంబర్ ప్లేట్ లేని 21 వాహనాలను గుర్తించి సంబంధిత వాహనాల వివరాలు నమోదు చేసి నిబంధన ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అక్రమంగా మద్యం తయారీ నిల్వపై నిర్వహించిన తనిఖీల్లో 35 లీటర్ల మద్య గుడుంబా సుమా-రు 700 లీటర్ల బెల్లం వాష్ ను గుర్తించి స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. సిఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించకుండా హెల్మెట్ ధరించి గంజాయి ఇతర మారకద్రవ్యాల విక్రయాలకు పాల్పడకుండా ఉండాలని యువకులు చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్ బాబు. రాజు కుమార్. కానిస్టేబుల్లు. పోలీసు సిబ్బంది. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన
# కాంగ్రెస్ నాయకులు



**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మహాదేవపూర్ మండలంలోని రాపల్లికోట, బెగులూరు గ్రామాల్లో దశదినకర్మ,ప్రథమ వర్ధంతి కార్యక్రమాల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు పాల్గొని మృతుల కుటుంబాల ను పరామర్శించారు.రాపల్లికోట గ్రామపంచాయతీకి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మోతే రాజయ్య ఇటీవల మృతి చెందగా వారి దిశదిన కార్యక్రమంలో,బెగులూరు గ్రామంలో పంతగి హరిచంద్ర పటేల్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటకం అశోక్‌తో పాటు నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.అనంతరం బాధిత కుటుంబాల సభ్యులని పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కాళేశ్వరం టెంపుల్ చైర్మన్ గుడాల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ లు గట్టయ్య, ఆకుల రాజయ్య, సీనియర్ నాయకుడు మడక ప్రతాప్,గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు కొట్టె రాజయ్య, నీలయ్య , రాజయ్య,రాజు,వెంకటస్వామి,పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..



**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన కొంతం బాలయ్య 75 మృతి చెందినట్లు త్రీ టౌన్ సీఐ లక్ష్మీ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా, తడ్కపల్లి నుండి సిద్దిపేట వైపు వస్తున్న హ్యుందాయ్ క్రెటా కారు నడుపుతున్న తొగుట మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ నీరిటి యాదగిరి వాహనాన్ని నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి బాలయ్యను వెనుక నుండి ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న మృతుని కుమార్తె కొంతం రాణి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని నిర్ధారించి, డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి నిర్వహిస్తున్న వివిధ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువును అక్టోబర్ 13, 2026 వరకు పొడిగించినట్లు మహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జన్ను విజయ్ కుమార్ గురువారం తెలిపారు.మహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కోడ్ 243 పరిధిలో విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులు, గృహిణులు, చదువును మధ్యలో నిలిపివేసిన వారు, ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ టీచర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఇంటర్మీడియట్, డిప్లొమా తదితర అర్హతలు కలిగిన వారు తమకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. అభ్యర్థులు గడువు తేదీలోపు అవసరమైన వివరాలను సమర్పించి, నిర్ణీత రుసుము చెల్లించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ప్రవేశాలకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజును 9849403237 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.



## స్వచ్ఛతపై విద్యార్థుల్లో అవగాహన పెంపు

**మహాదేవపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కాళేశ్వరం గ్రామంలోని హైస్కూల్, ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 4-వే సెగ్రిగేషన్ విధానంపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిళ్లను బహుమతులుగా అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు చెత్తను తడి, పొడి తదితర విభాగాలుగా వేరు చేయడం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం తీసుకురావడం ఎంతో అవసరమన్నారు.స్వచ్ఛమైన గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చెమ్మాల సుధీర్ కుమార్, వార్డు సభ్యులు నిట్టూరి మహేష్, వి. విజయలక్ష్మి, రెవెల్లి మమత, పెద్ది లక్ష్మి, సయ్యద్ ఇమ్రాన్, బొల్లం రాజశేఖర్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఏకగ్రీవంగా గ్రామ శాఖ అధ్యక్షుని ఎన్నిక

**మోతె, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మోతె మండలం తుమ్మగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన అధ్యక్షులు గా వీరాండీ రామాచారీ ని గ్రామ కార్యకర్తల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఉపాధ్యక్షులు గా తంతెన పల్లి ఉమశేఖర్, ప్రధాన కార్యదర్శి గా దుంపటి మల్లయ్య గారిని ఎన్నుకున్నారు ఈ సందర్భంగా రామాచారి గారు మాట్లాడుతూనా మీద నమ్మకం తో నూతన గ్రామ శాఖ అధ్యక్షులు గా నన్ను ఎన్నుకున్న నాయకులకు కార్యకర్తల కృతజ్ఞతలు తెలిపారు అలాగే భవిష్యత్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు

## ఉపాధ్యాయుల పని ఒత్తిడిని తగ్గించాలి
# మండల విద్యాధికారికి వినతి పత్రం




**మెదక్ జిల్లా / రేగోడ్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై రోజురోజుకూ పెరుగుతున్న పని ఒత్తిడి భారాన్ని తగ్గించాలని, అలాగే మండలంలోని ఏకోపాధ్యాయ (సింగిల్ టీచర్) పాఠశాలల్లో తక్షణమే విద్యా వాలంటీర్లను నియమించాలని కోరంతూ గురువారం రేగోడ్ మండల విద్యాధికారి గురునాత్ కి (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్) మండల శాఖ పక్షాన వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఒకే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలల్లో బోధనతో పాటు ఇతర పరిపాలనా పనులు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలన్నా, ఉపాధ్యాయులు ఒత్తిడి లేని వాతావరణంలో పనిచేయాలన్నా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వెంటనే విద్యా వాలంటీర్లను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎంఈఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేగోడు మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హరిజనాపురంలో ప్రభుత్వ భూమిని పరిశీలించిన తహశీల్దార్



**నల్లగొండ జిల్లా/చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** చింతపల్లి మండలం హరిజనాపురం గ్రామంలో తహశీల్దార్ విజయలక్ష్మి బుధవారం పర్యటించి ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమి హద్దులు, విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితిపై అధికారులు, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు అవ-సరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తహశీల్దార్ సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అన్విత ఎంపిక



**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎలిగేడు మండల కేంద్రంలోని జడ్‌పీహెచ్‌ఎస్ ఎలిగేడు పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని జక్కుల అన్విత రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ మహిళల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆమె, ఈ నెల 2న సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినిని ప్రోత్సహించే ఉద్దేశంతో పాఠశాల పీఈటీ కన్న ప్రణయ్ కబడ్డీ మ్యాట్ షూలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంద్ర దేవేందర్‌రావు చేతుల మీదుగా వాటిని బహూకరించారు.ఈ సందర్భంగా ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ కవ్వంపెల్లి రేఖ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు జక్కుల అన్వితను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## తోటి మెకానికుల మానవత్వం ఆదివాసి షేక్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**నల్లగొండ జిల్లా/చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** చింతపల్లి గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ ఆదివాసి షేక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి మెకానికులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివాసి షేక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమకు ఉన్న సానుభూతిని వ్యక్తం చేశారు.ఆదివాసి షేక్ లాస్య పీర్లకు రూ.25,000, అక్షర పీర్లకు రూ.25,000 చొప్పున మొత్తం రూ.50,000 ఆర్థిక సహాయాన్ని యాజ్ వైల్ రూపంలో అందజేశారు.అదేవిధంగా కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకొచ్చిన మెకానిక్ మిత్రుల మానవత్వాన్ని చింతపల్లి గ్రామస్తులు, ప్రజలు అభినందించారు. ఆపద సమయంలో కుటుంబానికి తోడుగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పరపల్లి కిరణ్, MD దస్తగిరి, నల్ల శ్రీను, SK చాన్, K. నరేష్, నల్ల రామకృష్ణ, SK. బక్కన్, SK. ముస్తఫా, MD ఖాజా తదితర మెకానిక్‌లు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా కార్యక్రమంలో
# కదిలిన గ్రామం



**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు ర్యాకల్ దేవ్‌పల్లి గ్రామంలో సామూహిక శ్రమదానం నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా-2026లో భాగంగా "ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్" కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ నేతృత్వంలో గ్రామంలోని ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు.ఈ సందర్భంగా రహదారుల వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొని రహదారులను శుభ్రం చేశారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించాలని సూచించారు.సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అధికారులు కార్యక్రమాలు నిర్వహించినప్పుడే కాకుండా ప్రజలు నిత్యం తమ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుక్క అశోక్, వార్డు సభ్యులు గుడికందుల చంద్రకళ, నరేష్, అంగన్‌వాడీ టీచర్ ఓదీశ్వరి, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీని అరెస్ట్ చేయాలి..!



**మేడ్చల్,ఫ్లాష్ ఇండియా :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సదానందం, తెలంగాణ జన సమితి అధికార ప్రతినిధి ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థను బలహీన పరిచే చర్యలను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల హక్కులను పునరుద్ధరించాలని, ఎస్‌ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్లను స్థానికంగా బీఎల్‌ఓలు, అధికారులు గుర్తించే విధానం ఉండగా, ఢిల్లీలో కూర్చొని కంప్యూటర్ల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని విమర్శించారు.తొలగించిన ఓటర్లకు తిరిగి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు రాజకీయ పార్టీల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ధర్మేంద్ర సీపీఎం అశోక్ సీపీఎంఎల్ మాస్ లైన్ ప్రవీణ్ తెలంగాణ జన సమితి లక్ష్మారెడ్డిలు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిల్ గౌడ్, హరినాథ్ రావు, లక్ష్మి, సత్యప్రసాద్, వి. శ్రీనివాస్, మహిళా సమైక్య నాయకురాళ్ళు మాధవి, ప్రమీల మహాలక్ష్మి, నరసమ్మ, రాజేశ్వరి, జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ్, యువజన సంఘం అధ్యక్షులు సల్మాన్ మండల కార్యదర్శులు బాబు, నరేంద్ర, ప్రసాద్, రాములు గౌడ్, ఈశ్వర్, సహాయ కార్యదర్శులు రాములు వెంకటేష్, సత్యనారాయణ అశోక్, నరేంద్ర చారి, అజీజ్, షబ్బీర్, ప్రవీణ్, అంబాల ఎల్లయ్య, సత్యం, నరసింహ, నాని, మహేష్, అక్బర్, సీపీఎం జిల్లా నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీలంక టార్గెట్ ఎంతంటే.?

ఏషియన్ గేమ్స్ 2026 పురుషుల క్రికెట్ రెండో సెమీఫైనల్‌లో భారత్ శ్రీలంక ముందు 170 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. నిషిన్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక తొలుత బౌలింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో భారత్ 7 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది.మ్యాచ్ విషయానికి వస్తే.. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 21 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 3 బంతుల్లో 7 పరుగులు చేసి మరోసారి నిరాశపరిచాడు. అలాగే సంజూ శాంసన్ 9 బంతుల్లో 7, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 13 బంతుల్లో 13 పరుగులు మాత్రమే చేశారు.అయితే భారత ఇన్నింగ్స్‌ను ఇషాన్ కిషన్ ముందుండి నడిపించాడు. 46 బంతులు ఎదుర్కొన్న ఇషాన్ 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 80 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చివర్లో వాషింగ్టన్ సుందర్ 3 బంతుల్లో 7 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో భారత్ 169 పరుగులకు చేరుకుంది. శ్రీలంక బౌలర్లలో సహన్ అరచ్చిగె 4 ఓవర్లలో 28 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. అలాగే తరిందు రత్నాయకె 2 వికెట్లు పడగొట్టగా, వనుజ సహన్, లసిత్ క్రూస్‌పుల్లె చెరో వికెట్ సాధించారు.ఇప్పుడు శ్రీలంక 20 ఓవర్లలో 170 పరుగులు చేస్తే ఫైనల్‌కు చేరుతుంది. ఈ సెమీఫైనల్ విజేత ఇప్పటికే ఫైనల్‌లో చోటు దక్కించుకున్న పాకిస్థాన్‌తో స్వర్ణ పతకం కోసం తలపడనుంది. ఒకవేళ ఓడిపోతే బంగ్లాదేశ్ తో కాంస్య పతకం కోసం పోరాడాల్సి వస్తుంది.

# హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఫైర్..




గువాహటిలోని బర్సపారా స్టేడియంలో సెప్టెంబర్ 30న జరిగిన మ్యాచ్ మామూలుగా లేదు. బౌలర్లను బ్యాటర్లు ఆటాడుకున్నారు. సిమెంట్ రోడ్డులా ఉన్న ఆ ఫ్లాట్ పిచ్‌పై బ్యాటర్లు పరుగుల వర్షం కురిపించారు. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు తమ వన్డే చరిత్రలోనే అత్యధికంగా 405 పరుగుల భారీ స్కోరు సాధించింది. అంత పెద్ద టార్గెట్‌ను కూడా భారత జట్టు కేవలం 39 బంతులు మిగిలి ఉండగానే చాలా ఈజీగా ఛేజ్ చేసి, తమ వన్డే హిస్టరీలోనే అతిపెద్ద రన్ ఛేజ్‌ను నమోదు చేసింది. ఇక, ఈ మ్యాచ్‌పై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదో చెత్త మ్యాచ్ అనే అర్థం వచ్చేలా మాట్లాడారు.మ్యాచ్ ముగిసిన తర్వాత ఆఫీషియల్ బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్‌లో పార్థివ్ పటేల్‌తో మాట్లాడిన గంభీర్.. ఇదసలు క్రికెట్ కాదని, ఒక రకమైన హాస్యాస్పదమైన విషయమని తీవ్రంగా స్పందించారు. బ్యాట్‌కు, బాల్‌కు మధ్య సరైన పోటీ ఉండాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇలాంటి మ్యాచ్‌లు టీవీ బ్రాడ్‌కాస్టర్లకు, కొత్త రికార్డులకు, ఆఖరికి ఫ్యాన్స్ వినోదానికి బాగుండొచ్చేమో కానీ, అసలైన క్రికెట్‌కి మాత్రం ఎంతమాత్రం మంచిది కాదన్నారు. మైదానంలో బ్యాటింగ్, బౌలింగ్ మధ్య సమతుల్యత ఉండాలని, బౌలర్ల గురించి కూడా ఆలోచించి వారికి కొంతైనా సహకారం అందించేలా పిచ్‌లు తయారు చేయాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి రోడ్డు లాంటి పిచ్‌లు మ్యాచ్‌ను పూర్తిగా ఒకే వైపు తిప్పేస్తాయని, ఇది క్రికెట్ పోటీతత్వానికే చాలా ప్రమాదకరమని గంభీర్ స్పష్టం చేశారు.మరోవైపు సోషల్ మీడియాలో కూడా క్రికెట్ అభిమానులు ఈ పిచ్ తీరుపై విపరీతంగా మండిపడుతున్నారు. అసలు గువాహటి లాంటి చోట్ల ముఖ్యమైన మ్యాచ్‌లు ఎలా కేటాయిస్తారంటూ ఒక అభిమాని సోషల్ మీడియాలో నిలదీశాడు. ఇక్కడ వన్డే పిచ్‌లతో పాటు టెస్టు పిచ్‌లు కూడా చాలా చెత్తగా ఉంటాయని, మైదానం సరిగ్గా లేకపోవడంతో పాటు లైటింగ్ సమస్యలు, పాన్ బహార్ ప్రకటనల గోల.. ఇలా ప్రతీదీ చాలా అసహ్యంగా ఉందంటూ కామెంట్ చేశారు. నిజానికి ఫ్యాన్స్, క్రికెట్ నిపుణులు పడుతున్న ఈ కోపంలో ఎంతమాత్రం తప్పులేదు. మ్యాచ్‌ల షెడ్యూల్, పిచ్‌ల తయారీ, జట్టు ఎంపిక లాంటి ప్రతి నిర్ణయం కేవలం డబ్బులు, వ్యాపారాల చుట్టూనే తిరిగితే అసలైన ఆట కనుమరుగైపోతుంది. నిన్నటి గువాహటి కావచ్చు లేదా మొన్నటి తిరువనంతపురం కావచ్చు.. రెండింట్లోనూ బౌలర్లు పూర్తి నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఇలాంటి భారీ స్కోర్ల పిచ్‌లు కేవలం పరుగుల రికార్డులకు మాత్రమే ఉపయోగపడతాయి తప్ప, రాబోయే ప్రపంచకప్ టోర్నీకి నాణ్యమైన తయారీకి మాత్రం ఎంతమాత్రం ఉపయోగపడవు.

# జాగింగ్ సెలబ్రేషన్స్‌పై రోహిత్ ఆసక్తికర వ్యాఖ్యలు!







టీమిండియా సీనియర్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ 35వ వన్డే సెంచరీతో అదరగొట్టాడు. బుధవారం గువాహటిలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో 75 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 101 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ ముందుగా 405/7 పరుగులు చేయగా.. భారత్ 43.3 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 406 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 223 పరుగులతో అజేయంగా నిలవగా.. రోహిత్ సెంచరీతో రాణించాడు. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ అనంతరం హిట్‌మ్యాన్ తన సెంచరీ సెలబ్రేషన్ వెనుక ఉన్న కారణాన్ని వెల్లడిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

**అది నా కోసమే:**

సెంచరీ అనంతరం రోహిత్ శర్మ చేసిన సంబరాలు అభిమానులను బాగా ఆకట్టుకున్నాయి. జాగింగ్ చేస్తున్నట్లు చేసిన సెలబ్రేషన్స్, హిట్‌మ్యాన్ ప్రదర్శించిన హావాభావాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ప్రత్యేక సెలబ్రేషన్ గురించి రోహిత్‌ను ప్రశ్నించగా.. నేను చెప్పను అని పరోక్షంగా చెప్పాడు. 'ఆ సెలబ్రేషన్ నా కోసమే. అది నా కోసం మాత్రమే. కొన్ని విషయాలు మనతోనే ఉండాలి. వాటిని ఇతరులతో పంచుకోకూడదు' అని రోహిత్ చెప్పాడు. జాగింగ్ సెలబ్రేషన్ వెనుక అసలు కారణం ఏమిటో మాత్రం రోహిత్ వెల్లడించలేదు. ఏదేమైనా జాగింగ్ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. రోహిత్ అసలు విషయాన్ని చెబితే బాగుండు అని ఫాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

**నాకు నేనే చెప్పుకున్నా:**

వెస్టిండీస్ నిర్దేశించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ కలిసి 250కి పైగా అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 'ఇలాంటి భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు పెద్ద భాగస్వామ్యాలు నెలకొల్పడం చాలా ముఖ్యం. అదే మేం చేశాం. గిల్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అతడి బ్యాటింగ్‌పై పూర్తి నియంత్రణ కనిపించింది. తొలి ఇన్నింగ్స్‌లో దాదాపు 50 ఓవర్లు ఫీల్డింగ్ చేసిన తర్వాత తీవ్రమైన వేడిలో బ్యాటింగ్ చేయడం సవాలుగా మారింది. అలాంటి పరిస్థితుల్లో ఏకాగ్రతను కోల్పోకుండా ఉండటమే కీలకం. నాకు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని ఉపయోగించుకున్నా. పరిస్థితులు సవాలుగా ఉన్నా.. సులభంగా వికెట్ ఇవ్వకూడదని నాకు నేనే చెప్పుకున్నా. పిచ్ బాగుందని మాకు తెలుసు. టాప్ ఆర్డర్ నుంచి భారీ పరుగులు అవసరమని భావించాం. ఆ దిశగా పరుగులు చేశాం' అని హిట్‌మ్యాన్ వివరించాడు.

**జడేజా అడిగినా చెప్పలేదు:**

తన సెంచరీ సెలబ్రేషన్ గురించి రవీంద్ర జడేజా కూడా అడిగాడని రోహిత్ శర్మ వెల్లడించాడు. 'జడేజా నన్ను ఆ సెలబ్రేషన్ గురించి అడిగాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో చెబుతానని చెప్పా. అది నా కోసమే అని అన్నా' అని నవ్వుతూ చెప్పాడు. అయితే జడేజా మాత్రం రోహిత్ కోసం మరో రకమైన సెలబ్రేషన్‌ను సూచించాడట. 'జడేజా చాలా క్రియేటివ్‌గా ఆలోచించాడు. నేను వచ్చి స్లైడ్ చేసి, జంప్ చేయాలని చెప్పాడు. కానీ 50 ఓవర్లు ఫీల్డింగ్ చేసి, దాదాపు 25-30 ఓవర్లు బ్యాటింగ్ చేసిన తర్వాత అలాంటి సెలబ్రేషన్ చేసే పరిస్థితిలో నేను లేను. అది న వల్ల కాదు' అని రోహిత్ సరదాగా వ్యాఖ్యానించాడు.

# పేస్, ఉష.. తర్వాత సురేఖనే



భారత్ నుంచి ఆసియా క్రీడల్లో అత్యధిక స్వర్ణాలు సాధించిన జాబితాలో విజయవాడ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ చోటు దక్కించుకుంది. ఈ జాబితాలో టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్ ఐదు స్వర్ణాలతో తొలి స్థానంలో నిలవగా, స్ప్రింట్ దిగ్గజం పీటీ ఉషతో కలిసి సురేఖ నాలుగు పసిడి పతకాలతో ద్వితీయ స్థానం పంచుకుంది. మొత్తంగా సురేఖ ఇప్పటివరకు ఆసియా క్రీడల్లో ఆరు మెడల్స్ కొల్లగొట్టింది. తాజాగా సాధించిన టీమ్ ఈవెంట్ స్వర్ణంతో ఆమె అంతర్జాతీయ పతకాల సంఖ్య 94కి చేరుకోవడం విశేషం. 2014 ఆసియా క్రీడల్లో మహిళల టీమ్ కాంస్యం, 2018 ఆసియా క్రీడల్లో మహిళల టీమ్ రజతం, 2022లో వ్యక్తిగత, మిక్స్‌డ్, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు, తాజాగా టీమ్ ఈవెంట్‌లో పసిడితో మెరిసింది. వరుసగా నాలుగు ఆసియా క్రీడల్లో పాల్గొని, పతకాలు సాధించిన ఏకైక భారత ఆర్చర్ సురేఖనే కావడం విశేషం.

# బిజినెస్




# విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గించిన కేంద్రం

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ఎగుమతులపై విండ్‌ఫాల్ గెయిన్స్ ట్యాక్స్‌ను తగ్గించింది. అయితే పెట్రోల్ ఎగుమతులపై మాత్రం పన్నును ఎలాంటి మార్పు లేకుండా యథాతథంగా ఉంచింది. డీజిల్ ఎగుమతులపై ఉన్న స్పెషల్ అదనపు ఎక్సైజ్ డ్యూటీ , రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్‌ను లీటరుకు రూ.20 నుంచి రూ.16కి తగ్గించారు. ఇక ఏటీఎఫ్ ఎగుమతులపై ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు రూ.15 నుంచి రూ.10.5కి తగ్గించారు.అదేవిధంగా రాబోయే పక్షం15 రోజుల పాటు పెట్రోల్ ఎగుమతులపై డ్యూటీని లీటరుకు రూ.0.5 వద్దే కొనసాగించారు. ఇందులో ఎలాంటి మార్పు చేయలేదు. ఈ కొత్త పన్ను రేట్లు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అలాగే, దేశీయ వినియోగం కోసం విక్రయించే పెట్రోల్, డీజిల్ ప్రస్తుత సుంకం రేట్లలో ఎలాంటి మార్పు లేదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు..




భారత్‌లో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. నిన్న ఓ మోస్తరు స్థాయిలో పెరిగిన మేలిమి ధర నేడు మళ్లీ స్వల్పంగా తగ్గింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ధరలు అంచనాలకు అందని విధంగా హెచ్చుతగ్గులకు లోనవుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేటి ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర నిన్నటితో పోలిస్తే రూ.330 మేర తగ్గి రూ.1,49,240కు చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధరలో కూడా కోత పడింది. ప్రస్తుతం ఆర్నమెంటల్ పసిడి ధర రూ.1,36,800గా ఉంది. 18 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర 1,11,930 వద్ద కదలాడుతోంది. నగరంలో కిలో వెండి రూ. 2.45 లక్షలుగా ఉంది.




# భారీగా పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర

వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ వినియోగదారులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంపుతో వరుస పండుగల హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. తాజాగా 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.62.50 పెంచారు. ఈ తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.2,837.50కి చేరుకుంది. ఇక ముంబై నగరంలో రూ.2,764, చెన్నైలో రూ.2,983, పట్నాలో రూ.3,100, హైదరాబాద్ నగరంలో రూ.3,065కి, విజయవాడలో 2,932.50, విశాఖపట్నంలో రూ.2,827.50కి ధరలు చేరాయి. ఇతర నగరాల్లోనూ స్థానిక పన్నుల ఆధారంగా ధరలు మారనున్నాయి.

**యథావిధిగా డొమెస్టిక్ సిలిండర్ ధరలు..**

సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా ఇళ్లలో వినియోగించే 14.2 కేజీల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ఇవి యథావిధిగా కొనసాగనున్నాయి. హైదరాబాద్‌లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994గా ఉంది. వ్యాపార రంగంపై ఆధారపడి జీవిస్తున్న వారికి, హోటల్ నిర్వహణదారులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారనుందని మార్కెట్ ఎక్స్‌పర్ట్స్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.




# ప్రతీ రోజు వడ్డీ రేట్లు వెల్లడించాల్సిందే..

బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి కీలక మార్పు రానుంది. అక్టోబర్ 1, 2026 నుంచి బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించిన వడ్డీ రేట్ల విషయంలో కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం పెద్ద మొత్తంలో డిపాజిట్లు చేసే ఖాతాదారులకు వడ్డీ రేట్ల విషయంలో మరింత పారదర్శకత కల్పించడమే..

**ప్రతిరోజూ వడ్డీ రేట్లు వెల్లడించాలి**

కొత్త నిబంధనల ప్రకారం బ్యాంకులు ప్రతి పనిదినం బల్క్ ఎఫ్‌డీలపై వర్తించే వడ్డీ రేట్లను తమ వెబ్‌సైట్‌లో వెల్లడించాల్సి ఉంటుంది. బ్యాంకులు ఉదయం 10 గంటలలోపు ఆ రోజు వడ్డీ రేట్లను అప్‌డేట్ చేయాలి. ఇందుకోసం ఉదయం 10.10 గంటల వరకు అదనపు గడువు కూడా ఉంటుంది. ఆ రోజు బల్క్ ఎఫ్‌డీ చేసిన ఖాతాదారులకు వెబ్‌సైట్‌లో ప్రకటించిన రేట్లే వర్తించనున్నాయి. అయితే, ఈ నిబంధనలు ప్రధానంగా బల్క్ డిపాజిట్లకు వర్తిస్తాయి. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లో సాధారణంగా రూ.3 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ మొత్తాన్ని బల్క్ డిపాజిట్‌గా పరిగణిస్తారు. అయితే ఇతర బ్యాంకుల వర్గాలను బట్టి బల్క్ డిపాజిట్ పరిమితులు భిన్నంగా ఉండవచ్చు. చిన్న మొత్తంలో సాధారణ ఎఫ్‌డీలు చేసే ఖాతాదారులపై ఈ ప్రత్యేక మార్పు నేరుగా ప్రభావం చూపదు. అంటే సాధారణ ఎఫ్‌డీ వడ్డీ రేట్లను ప్రతిరోజూ ఇలా వెల్లడించాల్సిన నిబంధన బల్క్ డిపాజిట్లకు సంబంధించినదే.

**బ్రాంచ్‌ల వారీగా వేర్వేరు రేట్లకు చెక్**

కొత్త నిబంధనల్లో మరో ముఖ్యమైన అంశం ఉంది. ఒకే బ్యాంకులో ఒకే రోజున, ఒకే మొత్తానికి, ఒకే కాలపరిమితితో చేసే బల్క్ ఎఫ్‌డీలకు వివిధ శాఖలు తమ ఇష్టానుసారం వేర్వేరు వడ్డీ రేట్లు అందించే విధానానికి పరిమితులు విధించనున్నారు. అయితే, లిక్విడిటీ కవరేజ్ రేషియో కు సంబంధించిన ప్రత్యేక నిబంధనల కారణంగా కొన్ని సందర్భాల్లో మినహాయింపులు ఉండొచ్చు.

**ఖాతాదారులకు ఏం ప్రయోజనం?**

పెద్ద మొత్తంలో డబ్బును ఎఫ్‌డీల్లో పెట్టుబడి పెట్టే వ్యక్తులు, సంస్థలు ప్రతి పనిదినం బ్యాంకు వెబ్‌సైట్‌లో బల్క్ ఎఫ్‌డీ వడ్డీ రేట్లను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వడ్డీ రేట్ల విషయంలో సమాచార లోపం తగ్గడంతో పాటు, బ్యాంకుల మధ్య రేట్లను పోల్చుకోవడం కూడా సులభం అవుతుంది. మొత్తంగా చూస్తే, కొత్త నిబంధనలు ప్రధానంగా బల్క్ ఎఫ్‌డీల వడ్డీ రేట్లను మరింత పారదర్శకంగా, క్రమబద్ధంగా వెల్లడించడంపై దృష్టి పెడుతున్నాయి. సాధారణ ఎఫ్‌డీ ఖాతాదారులు మాత్రం ఈ మార్పును తమ సాధారణ డిపాజిట్‌పై వర్తించే వడ్డీ రేటు మార్పుగా భావించాల్సిన అవసరం లేదు.




# ఊర్వశి రౌటేలా ఘాటు ప్రకటన!

బాలీవుడ్ హాట్ బ్యూటీ బ్యూటీ ఊర్వశి , లాస్ ఏంజిల్స్‌కు చెందిన ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా తన పేరు, ఫోటోలు, వీడియోలను వాడుకుంటున్నారంటూ ఆమె లీగల్ యాక్షన్‌కు దిగారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ.. ఆ కంపెనీపై ఏకంగా రూ.7,000 కోట్ల నష్టపరిహారం కోరుతూ న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరి వ్యాపారాలు, బ్రాండ్స్ వారు పెంచుకోవాలని, కానీ ఎలాంటి అనుమతి లేకుండా తన పేరును వాడితే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఊర్వశి చేసిన ఈ హెచ్చరికలపై Bollywood.AI వ్యవస్థాపకుడు, సీఈఓ షీరాజ్ హసన్ వెంటనే స్పందించారు.ఊర్వశి వేస్తున్న రూ. 7,000 కోట్ల లీగల్ క్లెయిమ్ చాలా హాస్యాస్పదంగా ఉందని ఆయన కొట్టిపారేశారు. గతంలో ఊర్వశితో తాను చేసిన ఇంటర్వ్యూ వైరల్ కావడంతోనే ఈ వివాదం తెరపైకి వచ్చిందని పేర్కొన్నారు. ఆ ఇంటర్వ్యూలో బాలీవుడ్, ఏఐ భవిష్యత్తు గురించి మాట్లాడినప్పుడు ఆమె సరిగ్గా సమాధానం చెప్పలేక తడబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఊర్వశి లీగల్ నోటీసులపై షీరాజ్ హసన్ దీటుగా బదులిచ్చారు. తాము ఎవరి నోటా బలవంతంగా ఆ మాటలు చెప్పించలేదని స్పష్టం చేశారు. ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఏఐ భవిష్యత్తు ఏంటో, టెక్నాలజీ ఏ విధంగా మారుతుందో ముందుగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ మూవీస్, డిజిటల్ స్టార్స్ దేనని.. రాబోయే మార్పును ఎవరూ ఆపలేరని, దాన్ని అందరూ స్వీకరించాలని అన్నారు. ప్రస్తుతం లీగల్ వివాదం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఊర్వశి పేరు మార్మోగిపోతోంది.



# బాక్సాఫీసు రికార్డులు ముఖ్యం కాదు..

కేవలం 16 ఏళ్ల ప్రాయంలోనే వైజాగ్ నుంచి బ్యాగ్ సర్దుకుని కోనార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కానని శోభిత తెలిపారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూద్దామని, ఎదురయ్యే ప్రతి సవాల్‌ను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధపడి అడుగు పెట్టానని చెప్పారు. మోడలింగ్, నటనపై ఉన్న విపరీతమైన ఆసక్తే చిన్న వయసులోనే సొంతూరిని విడిచిపెట్టేలా చేసిందని తెలిపారు. ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రుల సపోర్ట్ మరువలేనిదని, వారు తనకు ఇచ్చిన స్వేచ్ఛ, ధర్యమే తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. జీవితంలో ప్రతీ ఒక్కరి లైఫ్ జర్నీ డిఫరెంట్‌గా ఉంటుందని, అందరి గమ్యాలు ఒకేలా ఉండవని శోభిత పేర్కొన్నారు. మనసుకు నచ్చిన దారిని ఎంచుకుని ఎవరికీ భయపడకుండా ముందుకు వెళ్లాలని సూచించారు. ఇక సినిమాల ఎంపిక గురించి మాట్లాడుతూ.. కేవలం భారీ బడ్జెట్ చిత్రాలు చేయడం, వెయ్యి కోట్ల వసూళ్లు సాధించే సినిమాల్లో నటించడమే సక్సెస్ కాదని తేల్చిచెపా-ఎరు. బాక్సాఫీస్ రికార్డుల కంటే నటిగా తనకు పూర్తి సంతృప్తినిచ్చే పాత్రలు చేయడం, తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నిజాయితీగా ప్రయాణించడమే తన దృష్టిలో నిజమైన విజయమని శోభిత ధూళిపాళ్ల చెప్పుకొచ్చారు.




# నో కటింగ్స్.. ఓన్లీ ఎంటర్‌టైనింగ్..

హై జాయ్ కమర్షియల్స్ బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP -- వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన- దర్శకత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ 'చకోర -- Lunar Bird'. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ఆకట్టుకోగా.. అక్టోబర్ 9న థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఈ మూవీ సెన్సార్ పనులను పూర్తి చేసుకుంది. ఈ చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ సభ్యులు చిత్ర నిర్మాత అండ్ దర్శకుల్ని అభినందించారు. సెన్సార్ కత్తెరకు పని చెప్పకుండా యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను అతి తక్కువ నిడివి 2.17.58 సెకండ్స్‌తో ఆద్యంతం ప్రేక్షకులని సీట్‌లో నుంచి కదలకుండా కట్టిపడేసే స్క్రీన్ ప్లేతో చిత్రాన్ని రక్తి కట్టించారని చిత్ర యూనిట్‌ని ప్రశంసించారు. శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా చకోర ఈ చిత్రం విడదుల కాబోతుండగా.. U/A సర్టిఫికెట్‌తో సెన్సార్ విడుదలకు క్లియరెన్స్ ఇచ్చేసింది. చకోర ఆడియో హక్కులు టీసిరీస్ మ్యూజిక్ దక్కించుకుంది. కాగా.. ఈ చిత్రంలో శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్, యామిని, ఎల్ బి శ్రీరామ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

# గ్యాంగ్‌స్టర్స్‌గా కీర్తి సురేష్, రాధికా...



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్, టాలెంటెడ్ నటి రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'అక్క'. ఈ సిరీస్‌తో కీర్తి సురేష్ నేరుగా ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ధర్మరాజ్ శెట్టి తెరకెక్కించగా.. తన్వీ అజ్మీ, విశాఖ నాయర్, దివ్యా శ్రీపాద కీలక పాత్రల్లో నటిస్తున్నారు. బాలీవుడ్ దిగ్గజ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ డిజిటల్ వింగ్ అయిన YRF ఎంటర్‌టైన్‌మెంట్' ఈ సిరీస్‌ను నిర్మించింది. ఈ సిరీస్ పూర్తిగా 1980ల నాటి బ్యాక్‌డ్రాప్‌లో సాగే పీరియడ్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందింది.సౌత్ ఇండియాలోని 'పెర్నూరు' అనే ఒక కల్పిత నగరంలో ఈ కథ నడుస్తుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఇందులో కీర్తి సురేష్, రాధికా ఆప్టే ఇద్దరూ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్స్‌గా కనిపించనుండటం విశేషం. వీరిద్దరి మధ్య వచ్చే మాస్ అండ్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని సమాచారం.ఇక ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సిరీస్.. ఎట్టకేలకు రిలీజ్‌కు రెడీ అయింది. ఈ సిరీస్‌కు సంబంధించిన ఓటీటీ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అక్టోబర్ 30 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ రోల్స్‌లో కీర్తి, రాధికలను చూసేందుకు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# పాన్ ఇండియా మూవీతో బాలీవుడ్ ఇండస్ట్రీకి ...



టాలీవుడ్ డైరెక్టర్ చందూ మొండేటి కార్తికేయ-2, తండ్రేల్ వంటి చిత్రాలతో బాక్సాఫీసును షేక్ చేశారు. ఇక ఇప్పుడు భారీ పౌరాణిక 3Dయానిమేషన్ సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆంజనేయుడి కథ ఆధారంగా రాబోతున్న 'వాయుపుత్ర' దసరా కానుకగా విడుదల కాబోతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. చందూ మొండేటికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆయన త్వరలోనే బాలీవుడ్‌లోకి అడుగుపెట్టబోతున్నట్లు టాక్. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, టాలీవుడ్ హంక్ రానా దగ్గుబాటి ప్రధాన పాత్రలో నటిస్తున్నారట.మైథలాజికల్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రానికి 'మహాకాళ్' అనే టైటిల్ పెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమాను ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మిస్తారని వార్తలు వచ్చాయి. కానీ లేటెస్ట్ సమాచారం ప్రకారం.. బాలీవుడ్ ప్రముఖ దర్శక-నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ తన 'భన్సాలీ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్నారట. అంతేకాదు, ఈ చిత్రానికి కేవలం నిర్మాణమే కాకుండా, కథను కూడా సంజయ్ లీలా భన్సాలీయే అందించినట్లు సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలను పెంచేసింది. కానీ ఈ సినిమాపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# తీవ్ర ఆందోళనలో బిగ్ బీ ఫ్యాన్స్



బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ షూటింగ్ సెట్‌లో అపశృతి చోటుచేసుకుంది. ఆయన హోస్ట్ చేస్తున్న ప్రముఖ టెలివిజన్ రియాలిటీ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షూటింగ్ సమయంలో ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి జారిపడి కింద పడ్డారు. ఈ ఘటనలో ఆయన మోకాలికి గాయమైనట్లుగా తెలుస్తోంది. షూటింగ్ జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా జరిగిన ఈ ప్రమాదంతో సెట్‌లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యులు ఆయనకు తగిన చికిత్స అందించారు. వయసురీత్యా అమితాబ్ బచ్చన్ ఎంతో శ్రమిస్తూ కేబీసీ షూటింగ్స్‌లో పాల్గొంటున్నారు. ఈ తాజా ఘటనతో ఆయన అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బిగ్ బీ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా ప్రార్థనలు చేస్తున్నారు.




# చిన్ననాటి కల నెరవేరినట్లుగా...

బాలీవుడ్ యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ శార్వరి వాఘ్ తన అందం, ప్రతిభతో వరుస అవకాశాలు అందుకుంటూ ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం ఈ అమ్మడు ప్రముఖ దిగ్గజ దర్శకుడు సూరజ్ బార్జాత్యా తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'యే ప్రేమ్ మోల్ లియా'లో నటిస్తోంది. ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాలో యంగ్ హీరో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శార్వరి కనిపించనుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ సాంగ్ యూట్యూబ్‌లో బాగా ట్రెండ్ అవుతోంది. ఈ పాట లాంచ్ సందర్భంగా.. శార్వరి తన చిన్ననాటి ముచ్చట్లను పంచుకుంటూ ఎమోషనల్ అయింది.చిన్నతనంలో 'దిదీ తేరా దేవార్ దీవానా' పాటలో మాధురీ దీక్షిత్, 'మైయ్యా యశోదా' పాటలో కరిష్మా కపూర్, సోనాలీ బింద్రేలను చూస్తూ పెరిగానని శార్వరి తెలిపింది. ఆ ఐకానిక్ పాటలు చూసిన ప్రతిసారీ ఇంటికొచ్చి అద్దం ముందు నిలబడి డ్యాన్స్ చేస్తూ, తనను తాను తెరపై హీరోయిన్‌గా ఊహించుకునేదాన్ని అని చెప్పింది. ఆ పాతకాలపు క్లాసిక్ బాలీవుడ్ పాటల్లోని ప్రేమ, భావోద్వేగాలు, మ్యాజిక్ వల్లే తనకు నటి కావాలనే బలమైన కోరిక కలిగిందని పంచుకుంది. లెజెండరీ ఫిల్మ్‌మేకర్ సూరజ్ బార్జాత్యా దర్శకత్వంలో చేయడం తన చిన్ననాటి కల నెరవేరినట్లుగా అనిపిస్తుందని శార్వరి చెప్పుకొచ్చింది. ఇక ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్స్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




# మూవీ లవర్స్‌కు పండగే

సెప్టెంబర్‌లో బోసిపోయిన టాలీవుడ్‌కు అసలైన పండగను తీసుకురాబోతున్నాయి అక్టోబర్ మూవీస్. రాజమౌళి ప్రజెంటర్‌గా వ్యవహరిస్తున్న డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ అక్టోబర్ 2న రిలీజ్ కాబోతోంది. అదే రోజు జానస్ సంజయ్ మొదటి సినిమా 'సిగ్మా', ఆది సాయి కుమార్ 'ఎస్ ఐ యుగంధర్',' తెల్లకాగితం' సినిమాలు రిలీజ్ కాబోతున్నాయి. సుమారు పది రోజుల పాటు వచ్చే దసరా సెలవుల్ని క్యాష్ చేసుకునేందుకు సిద్ధమయ్యారు స్టార్ హీరోస్. వెంకటేష్ అండ్ త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కుతోన్న ఆదర్శ కుటుంబం అక్టోబర్ 9న రాబోతోంది. తన ఫేవరేట్ హీరోతో అదే రోజు ఢీ అంటున్నాడు శ్రీ విష్ణు. 'కామ్రేడ్ కళ్యాణ్' అంటూ యాక్షన్ కామెడీ డ్రామాతో వస్తున్నాడు.ఈ దసరాకు అసలు సిసలైన పోరు మొదలు కాబోతోంది. అక్టోబర్ 15న జైలర్2తో తమిళ్ బాక్సాఫీసే కాదు టాలీవుడ్ థియేటర్స్‌ను షేక్ చేసేందుకు సిద్ధమయ్యాడు రజనీకాంత్. టాలీవుడ్‌లో రజనీతో ఢీ కొడుతున్నాడు యంగ్ హీరో విజయ్ దేవరకొండ. పీరియాడిక్ యాక్షన్ డ్రామా రణబాలితో అక్టోబర్ 16న ఆడియన్స్ ముందుకు వస్తున్నాడు. అక్టోబర్ 17న గరివిడి లక్ష్మీ అంటూ రాబోతుంది ఆనంది. పండగ అయిపోయినా మేము వస్తున్నాం అంటున్నారు మరికొంత మంది యంగ్ హీరోస్. విశ్వక్ సేన్ డైరెక్ట్ చేస్తోన్న మూవీ 'కల్ట్' అక్టోబర్ 30న రిలీజ్ కాబోతోంది. ఇప్పటి వరకు వయెలెన్స్,థ్రిల్లర్ చిత్రాలతో ఆకట్టుకున్న డైరెక్టర్ శైలేష్ కొలను, ఈసారి రొమాంటిక్ ఫిల్మ్ 'ఏమో ఏమో ఇది' మూవీతో వస్తున్నాడు. రోషన్, ప్రీతి ముకుందన్ జంటగా నటించిన ఈ సినిమా.. అక్టోబర్ మంత్ ఎండింగ్ ఆడియన్స్ ముందుకు రాబోతోంది. అనీష్ హీరోగా పరిచయమౌతోన్న 'ఇట్లు అర్జున' కూడా అక్టోబర్ 30న వస్తోంది. డైరెక్టర్ వెంకీ కుడుముల ఈ మూవీని నిర్మిస్తున్నాడు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**